# విశాల భారతి

తెలుగు దినపత్రిక

01-06-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

సోమవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 147


## పెండింగ్ ప్రాజెక్టులపై సీఎం సర్జికల్ స్ట్రైక్!



- అభివృద్ధి పనుల ప్రారంభం,
- ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ
- కాగజ్ నగర్ క్రాస్ రోడ్డు వద్ద ప్రజా ప్రసంగం
- రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు
- 3న పాలమూరు-రంగారెడ్డి, 4న జూరాల ప్రాజెక్టుల పరిశీలన
- 3న కోహెడ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్ పనులు
- పర్యటనలో స్వల్ప మార్పులు ఉండే అవకాశం

02

## ఈ ఏడాది చివర్లోనే జీహెచ్ఎంసీ ఎన్నికలు?

- నవంబర్‌లో జీహెచ్ఎంసీ ఎన్నికలు నిర్వహించే అవకాశం
- అక్టోబర్‌లో ఓటరు జాబితా, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి
- జీహెచ్ఎంసీతో పాటు మల్కాజ్‌గిరి, సైబరాబాద్ ఎన్నికలపై ఆసక్తి
- సైబరాబాద్ కార్పొరేషన్‌కు అత్యధికంగా రూ. 916 కోట్ల పన్ను ఆదాయం
- 28 అసెంబ్లీ స్థానాల పరిధిలో ఉన్నందున అన్ని పార్టీలకు ప్రతిష్టాత్మకం
- మౌలిక వసతుల కల్పన ద్వారా ఓటర్లను ఆకట్టుకునే యత్నం




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాజధాని మహా నగరం హైదరాబాద్ పరిధిలోని మూడు ప్రధాన మున్సిపల్ కార్పొరేషన్లలో ఎన్నికల వేడి ఇప్పుడే మొదలైంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పీఠాన్ని దక్కించుకునేందుకు రాజకీయ పార్టీలు పావులు కదుపుతున్నాయి. ఉన్నతాధికారుల సమాచారం మేరకు నవంబరు నెలలో పోలింగ్ నిర్వహించేలా ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయం తీసుకుంది. ఓటరు జాబితా సవరణకు సంబంధించి చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం అక్టోబరు రెండో వారంలో ముగియనుంది. ఆ జాబితా ఆధారంగానే కొత్తగా ఏర్పడిన డివిజన్లలో పోలింగ్ కేంద్రాలను ఖరారు చేస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బీసీ కులగణన సర్వే రిపోర్టులు వెలువడగానే, వాటి ఆధారంగా డివిజన్ల వారీగా రిజర్వేషన్లు ఖరారు కానున్నాయి. ఆ రెండు ప్రక్రియలు పూర్తి కాగానే నవంబరులో ఎన్నికల నగారా మోగనుంది. మూడు కార్పొరేషన్లు ఉన్నప్పటికీ మొదట జీహెచ్ఎంసీకే ఎన్నికలు నిర్వహించడానికి బలమైన కారణాలు కనిపిస్తున్నాయి. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను విలీనం చేస్తూ ఫిబ్రవరిలో ప్రభుత్వం పునర్విభజన చేపట్టింది. ఫిబ్రవరి 10, 2026న జీహెచ్ఎంసీ పాలక మండలి గడువు ముగియగా, మరుసటి రోజు నుంచే ఎంఎంసీ, సీఎంసీ అనే కొత్త సంస్థలు పుట్టుకొచ్చాయి. చట్టం ప్రకారం పాలక మండలి గడువు ముగిసిన ఆరు నెలల్లో ఎన్నికలు జరపాల్సి ఉంటుంది. పాత నిబంధనలు జీహెచ్ఎంసీకే వర్తిస్తాయని, అందుకే ఆ పరిధిలోనే ఎన్నికల ప్రక్రియ మొదట చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. పునర్విభజనతో స్థానిక సంస్థల రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది.

మిగతా 3లో..

# తెలంగాణలో జనసేనకు చోటుందా?



**జూన్ 2న హైదరాబాద్‌లో జనసేన భారీ సమ్మేళనం**

- బీజేపీతో కలిసి తెలంగాణలో యాక్టివ్ అయ్యేందుకు పవన్ ప్రణాళిక
- సామాజిక సమీకరణాల కోసం పవన్ వ్యూహాలకు బీజేపీ ప్రాధాన్యత
- ఏపీ ఎన్నికల విజయంతో తెలంగాణలోనూ అదే ఉత్సాహం
- కాంగ్రెస్, బీఆర్ఎస్ ఆధిపత్యం మధ్య ఉనికిని చాటుకోవడం కీలకం
- తెలంగాణ రాజకీయాల్లో జనసేన కొత్త అధ్యాయానికి శ్రీకారం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఈసారి పరిస్థితి భిన్నంగా ఉంటుందని, కాంగ్రెస్ పాలనతో విసిగిపోయిన తెలంగాణ ప్రజలు ప్రత్యామ్నాయం కోసం చూస్తున్నారని ఒక వర్గం బలంగా నమ్ముతోంది. ఆంధ్రలో వైసీపీ పాలనపై విసిగిపోయిన ఓటర్లు ఏ విధంగా చంద్రబాబుకు పట్టం కట్టారో, తెలంగాణలో కూడా అలాంటి మార్పు రావాలని కోరుకుంటున్నారని రాజకీయ విశ్లేషకులు ఒక ఆసక్తికరమైన లాజిక్ చెబుతున్నారు. ఈ లెక్కన చూస్తే తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ తప్ప మరే పార్టీకి చోటు ఉండదని కొందరు వాదిస్తుంటే, క్షేత్రస్థాయిలో పరిస్థితులు వేరేలా ఉన్నాయని ఇంకొందరు వాదోపవాదాలకు దిగుతున్నారు. క్షేత్రస్థాయి రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్న తీరు గమనిస్తే రాజకీయ విశ్లేషణలు సంక్లిష్టంగా మారుతున్నాయి. ఈ నెల 10న ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటనకు వచ్చినప్పుడు చోటుచేసుకున్న పరిణామాలు గమనార్హం. చంద్రబాబు, పవన్ కల్యాణ్ నివాసాలకు ఆయన వెళ్ళడం ద్వారా తెలంగాణలో బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి కలిసి పనిచేయబోతున్నాయనే బలమైన సంకేతాలు వెలువడ్డాయి. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ వేదికగా జరిగిన సభలో పశ్చిమ బెంగాల్ తర్వాత బీజేపీ టార్గెట్ తెలంగాణనే అని ప్రధాని స్పష్టం చేశారు. ఈసారి ఎన్నికల్లో విజయం సాధించి అధికార పీఠాన్ని దక్కించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మాటలను కేవలం రాజకీయ

మిగతా 3లో..

జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేళ హైదరాబాద్ వేదికగా 'తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ-జనసేన సాధక్ సమ్మేళనం' నిర్వహిస్తున్నట్లు జనసేన పార్టీ ప్రకటించడం రాజకీయ వర్గాల్లో కొత్త చర్చలకు తెరలేపింది. ఈ ప్రకటన వెలువడిన వెంటనే సోషల్ మీడియాలో ఆంధ్ర, తెలంగాణ ప్రాంతీయ వాదనలు మళ్ళీ భగ్గుమన్నాయి. రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్‌లో జనసేనను ప్రకటించిన వేళ ఎవరూ పెద్దగా అభ్యంతరాలు వ్యక్తం చేయలేదు. ఆనాడు కొందరు ఇది ప్రజారాజ్యం తరహాలోనే ఆరు నెలల్లో కనుమరుగవుతుందని జోస్యం చెప్పారు. అయితే ఆ అంచనాలు తలకిందులయ్యాయి. పవన్ కల్యాణ్ పట్టుదలతో పార్టీని నిలబెట్టుకుంటూ సుదీర్ఘ రాజకీయ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.



## 24 గంటల కరెంటు ఇస్తేనే ఓట్లు అడగండి

- 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని సీఎం స్పష్టంగా ప్రకటించాలి
- రైతు డిస్కం ఏర్పాటు పూర్తిగా అర్ధరహితమైన నిర్ణయం
- నీటి పారుదల ప్రాజెక్టులకు కరెంటు కష్టాలు తప్పవు

02



## ఢిల్లీలో నాటకాలు ఎందుకు రాహుల్ జీ..?

- ఢిల్లీ లంచ్ డ్రామాలు వద్దు, తెలంగాణ హామీలు నెరవేర్చండి
- ఆటో సంక్షేమ బోర్డు, రూ. 12 వేల సాయం ఏవి?
- 30 నెలల్లో 100 మంది డ్రైవర్ల మృతికి ప్రభుత్వమే బాధ్యత
- అప్పుల బాధతో డ్రైవర్ల జీవితాలు అగమ్యగోచరం
- పాలన మారినా డ్రైవర్ల తలరాత మారలేదు
- బోర్డు ఏర్పాటు చేసి డ్రైవర్లను ఆదుకోవాలి

03



## పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేక ప్లాన్!

- మంథని (రూ.93 లక్షలు), కాళేశ్వరం (రూ.3 కోట్లు) కేటాయింపు
- బస్టాండ్ల ఆధునికీకరణ, ప్రత్యేక బస్సుల ఏర్పాటు
- కొత్త బస్సులు, డిపోల ఏర్పాటు, సిబ్బంది నియామకాలు
- ఆర్టీసీలో మహిళలకు భాగస్వామ్యం, ఉచిత ప్రయాణ సేవలు
- పెద్దపల్లి డిపో, త్వరలోనే కొత్త డిపో ప్రారంభం
- విలీన ప్రక్రియపై స్పష్టత, అపోహలు వద్దని సూచన

02

## నిప్పులు చెరుగుతున్న ఎండలు

- జూన్ 3 వరకు 41-44C ఉష్ణోగ్రతలు, ఆరెంజ్ అలర్ట్
- మంచిర్యాల (బెల్లంపల్లి)లో 45.4C నమోదు
- వడదెబ్బ మరణాలు, శనివారం 13 మంది మృతి
- 5 రోజుల్లో కేరళకు రాక; తెలంగాణలో వర్షపాతం లోటు అంచనా
- వాతావరణ సమాచారం వాట్సాప్ ద్వారా రైతులకు
- తొలి విడతగా 17 జిల్లాల్లో అమలు

05



## ఈటలకు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు

- ఈటలపై ఫ్లెక్సీలతో బీజేపీలో వర్గ విభేదాలు బయటపడ్డాయి
- వ్యక్తిగత ఇమేజ్, ఓటములపై ఈటలపై ఆరోపణలు
- అర్వింద్ పేరును లాగి పోటీని బహిర్గతం చేశారు
- ఇది బయటి కుట్రని అధిష్ఠానం తెలిపింది
- నిందితులపై కఠిన చర్యలకు నిర్ణయం
- వివాదంతో సంబంధం లేదని స్పష్టం

02




## రైతు డిస్కం వెనుక పెద్ద కుట్ర!

- రైతు డిస్కం పేరుతో ఇతర డిస్కంలను ప్రైవేటుపరం చేసేందుకు యత్నం
- విద్యుత్ ఉచితమని, మీటర్లు పెట్టమని సీఎం రాతపూర్వక హామీ ఇవ్వాలి
- డిస్కంల మార్పుతో సాగు ఖర్చులు 40శాతం పెరిగే అవకాశం
- సామాన్యుల ఇళ్ల కూల్చివేత రాజకీయ ప్రతీకారమే

03

- 30 నెలలుగా హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలం
- ఆదాయ మార్గాల్లేక అప్పులతోనే రాష్ట్రం నడుస్తోంది



# పెండింగ్ ప్రాజెక్టులపై సీఎం సర్జికల్ స్ట్రైక్!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధిని పరుగులు పెట్టించే లక్ష్యంతో క్షేత్రస్థాయి పర్యటనలకు శ్రీకారం చుట్టారు. పరిపాలనను ప్రజలకు చేరువ చేయడమే కాకుండా, క్షేత్రస్థాయిలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను వేగవంతం చేయాలని ఆయన నిర్ణయించుకున్నారు. జూన్ మొదటి వారం కీలకమైన షెడ్యూల్‌తో ముఖ్యమంత్రి అసిఫాబాద్ నుంచి మహబూబ్ నగర్ వరకు పర్యటించనున్నారు. పాలనలో పారదర్శకత, అభివృద్ధిలో వేగం ఈ పర్యటన ప్రధాన ఉద్దేశ్యం. కొమురంభీం అసిఫాబాద్ జిల్లా నుంచి మొదలయ్యే ఈ పర్యటన రాష్ట్రవ్యాప్త అభివృద్ధి పనులకు ఒక దిశానిర్దేశం చేయనుంది. ప్రభుత్వ యంత్రాంగం ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. కొమురంభీం అసిఫాబాద్ జిల్లా పర్యటన కోసం ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో బయలుదేరి సోమవారం ఉదయం జిల్లా కేంద్రానికి చేరుకుంటారు. గిరిజన ప్రాంతమైన ఈ జిల్లాలో మౌలిక వసతుల కల్పనపై ఆయన ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి స్వయంగా ప్రారంభించనున్నారు. పేదలకు గూడు కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ పర్యటన ద్వారా స్థానిక సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఆయన ప్రయత్నిస్తారు. ప్రజా ప్రతినిధులు, అధికారులతో ఆయన సమావేశమై అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షిస్తారు. రెబ్బెన మండలం కాగజ్ నగర్ క్రాస్ రోడ్డు వద్ద భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు అధికార యంత్రాంగం భారీగా ఏర్పాట్లు చేస్తోంది. వేల సంఖ్యలో తరలిరానున్న ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించనున్నారు. కాగజ్ నగర్ పరిసర ప్రాంతాల్లోని ప్రజల ప్రధాన డిమాండ్లను నెరవేర్చేందుకు ఆయన కొన్ని కీలక ప్రకటనలు చేసే అవకాశం ఉంది.



గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ వివరాలను ఆయన సభలో వెల్లడించే అవకాశం ఉంది. సభ ద్వారా స్థానిక ప్రజలతో మమేకమై ప్రభుత్వ పథకాల అమలు తీరును ఆయన వివరించనున్నారు. జూన్ 2వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు జరగనున్నాయి. ఈ వేడుకల కోసం ముఖ్యమంత్రి ఇప్పటికే ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేశారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ భవనాలపై రంగుల అలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలతో రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొల్పాలని అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. అవతరణ దినోత్సవం వేళ ప్రభుత్వం చేపట్టబోయే కొత్త పథకాలపై ప్రజల్లో భారీగా ఆశలు నెలకొన్నాయి. ఉద్యమ ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ఆయన వేడుకల్లో పాల్గొంటారు. జూన్ 3వ తేదీ ముఖ్యమంత్రి పర్యటనలో అత్యంత కీలకమైన రోజుగా నిలవనుంది. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను స్వయంగా పరిశీలించేందుకు ఆయన రంగంలోకి దిగుతున్నారు. రాష్ట్ర సాగునీటి రంగంలో ఈ ప్రాజెక్టు అత్యంత కీలకమైనది. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. సుమారు 35,000 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా లక్షలాది ఎకరాల భూమి సాగులోకి రానుంది. ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ప్రాజెక్టు వద్దే ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించి పనుల పురోగతిని తెలుసుకుంటారు. రంగారెడ్డి జిల్లా కోహెడలో 239 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించతలపెట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారు. ఇది హైదరాబాద్ శివార్లలో అత్యంత ఆధునిక వసతులతో కూడిన మార్కెట్ కానుంది. సుమారు 1,200 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఈ మార్కెట్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. రైతులు తమ పంటను నేరుగా మార్కెట్ చేసుకొని లాభాలు పొందేలా ఈ ప్రాజెక్టును రూపొందించారు. దీని ద్వారా వేలాది మంది రైతులకు మరియు వ్యాపారులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. నగరీకరణలో భాగంగా ఈ ప్రాజెక్టు ఒక నమూనాగా నిలుస్తుందని అధికారులు భావిస్తున్నారు. జూన్ 4వ తేదీన ముఖ్యమంత్రి మహబూబ్ నగర్ జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలోని జూరాల ఎత్తిపోతల పథకం పనితీరును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీటిని నిల్వ చేసే సామర్థ్యం పెంచడం మరియు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ఆధునీకరించడంపై ఆయన అధికారులతో చర్చిస్తారు. సుమారు 450 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల జూరాల ప్రాజెక్టును పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జూరాల కాలువల మరమ్మతులు, ఆయకట్టుకు నీటి పారుదల కల్పనలో ఎదురవుతున్న ఇబ్బందులను ఆయన స్వయంగా తెలుసుకుంటారు. రాష్ట్రవ్యాప్త పర్యటనల ద్వారా పాలనలో వేగం పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను తెలుసుకున్నప్పుడే పరిపాలన సమర్థవంతంగా సాగుతుందని ఆయన బలంగా నమ్ముతున్నారు. గతంలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టుల నిర్మాణంపై ఆయన పూర్తిస్థాయిలో నివేదికలను తెప్పించుకుంటున్నారు. ప్రతి ప్రాజెక్టుకు నిర్దేశిత సమయం కేటాయించి సకాలంలో పూర్తి చేయాలని అధికారులను హెచ్చరిస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు పర్యవేక్షణలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నా, స్వయంగా పరిశీలించడం వల్ల పనుల్లో నాణ్యత పెరుగుతుందని ఆయన భావిస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్ అధికారికంగా వెల్లడించినప్పటికీ, క్షేత్రస్థాయి పరిస్థితుల ఆధారంగా ఇందులో కొన్ని మార్పులు ఉండే అవకాశం ఉన్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు తెలిపారు. వాతావరణ పరిస్థితులు, అత్యవసరమైన పరిపాలనా పరమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితులు తలెత్తితే ఈ షెడ్యూల్ మారే అవకాశం ఉంది. ప్రతి జిల్లా పర్యటనకు ముందు కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష సమావేశాలు జరగనున్నాయి. ఏ చిన్న లోపం లేకుండా పర్యటనను నిర్వహించాలని డీజీపీ కార్యాలయం నుండి ఆదేశాలు వెళ్లాయి. భద్రతాపరమైన ఏర్పాట్లు, ట్రాఫిక్ నిబంధనలను పాటించేలా స్థానిక పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది.




# పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేక ప్లాన్!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మంథని, కాళేశ్వరం ప్రాంతాల్లో రవాణా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ప్రజారవాణా సేవలను మరింత మెరుగుపరిచి సామాన్యులకు మెరుగైన వసతులు కల్పించడమే ధ్యేయంగా రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక నిర్ణయాలు ప్రకటించారు. ఆదివారం మంథని మున్సిపాలిటీ పరిధిలోని బస్టాండ్ ఆవరణలో రూ.93 లక్షల భారీ వ్యయంతో చేపట్టనున్న అదనపు ప్లాట్‌ఫారాలు, ఇతర అభివృద్ధి పనులకు మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శంకుస్థాపన చేశారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో ఈ నిధులను మంజూరు చేసినట్లు మంత్రి పొన్నం ఈ సందర్భంగా వెల్లడించారు. గోదావరి పుష్కరాలు-2027 ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తోంది. కుంభమేళాను తలపించే రీతిలో ఈ పుష్కరాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించామని, అందుకోసం ప్రత్యేకంగా క్యాబినెట్ సబ్ కమిటీని కూడా ఏర్పాటు చేశామని మంత్రి పొన్నం వివరించారు. ఈ పండుగకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి గ్రామం నుంచి పుష్కర క్షేత్రాలకు చేరుకునేలా సమగ్ర కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. బాసర నుంచి భద్రాచలం వరకు అన్ని ప్రధాన బస్టాండ్లను ఆధునీకరిస్తూ ప్రయాణికులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను యుద్ధ ప్రాతిపదికన కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా ఆర్టీసీ అందించిన సేవలను స్ఫూర్తిగా తీసుకుని, రాబోయే పుష్కరాలకు కూడా ప్రత్యేక బస్సు సర్వీసులను భారీ స్థాయిలో నడపాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత పదేళ్ల కాలంలో ఆర్టీసీని పట్టించుకోని పరిస్థితులు ఉండేవని, కొత్త బస్సుల కొనుగోళ్లు కానీ, సిబ్బంది నియామకాలు కానీ జరగలేదని మంత్రి విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీని ఒక లాభదాయకమైన సంస్థగా మార్చడమే కాకుండా, కార్మికుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం కొత్త బస్సుల కొనుగోలు ప్రక్రియ మరియు సిబ్బంది భర్తీ కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు. మహిళల ప్రయాణ సౌకర్యాల కోసం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం విజయవంతంగా సాగుతోంది. ఈ ఉచిత బస్సు ప్రయాణ పథకం కింద ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 310 కోట్ల జీరో టికెట్లు జారీ అయ్యాయని మంత్రి గణాంకాలతో సహా చెప్పారు. ఇది మహిళా సాధికారతకు ఒక గొప్ప నిదర్శనమని, దీని ద్వారా వారి ఆర్థిక స్థితి మెరుగుపడుతోందని తెలిపారు.



ఇక ఆర్టీసీని అభివృద్ధిలో భాగస్వామ్యం చేసేందుకు ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని బలంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రయాణికుల సంఖ్యను బట్టి బస్సుల రాకపోకలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రస్తుతం రోజుకు 65 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీని నమ్ముకున్నారని ఆయన స్పష్టం చేశారు. రోజువారీ రవాణా సేవలను విశ్లేషిస్తే మన ఆర్టీసీ బస్సులు ప్రతిరోజూ సుమారు 35 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తున్నాయని మంత్రి వెల్లడించారు. ఇంతటి భారీ నెట్‌వర్క్‌ను నిర్వహిస్తున్న సంస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియపై కార్మికులు ఎటువంటి అపోహలకు గురికావద్దని మంత్రి భరోసా ఇచ్చారు. సంస్థను కాపాడుకుంటూనే, ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలు కల్పించడం తమ ప్రాథమిక లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల కష్టానికి తగ్గ ప్రతిఫలం అందేలా చర్యలు ఉంటాయని, ప్రయాణికుల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తమ ముందున్న ప్రధాన కర్తవ్యమని అన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తనదైన శైలిలో మంథని అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. మంథని బస్టాండ్ విస్తరణ పనుల కోసం రూ.74 లక్షలు, అదనపు ప్లాట్‌ఫారాల కోసం రూ.19 లక్షలతో మొత్తం రూ.93 లక్షల నిధులు కేటాయించినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా కాళేశ్వరం బస్టాండ్ ఆధునికీకరణకు రూ.3 కోట్ల భారీ నిధులు మంజూరు చేశామని వెల్లడించారు. కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని, క్షేత్ర స్థాయి అభివృద్ధిలో ఆర్టీసీని కీలకం చేస్తామని ఆయన వివరించారు. పవిత్రమైన కాళేశ్వరం క్షేత్రానికి రవాణా పరంగా ఎటువంటి లోటు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. దశాబ్దాల కాలంగా మంథని ప్రజలు కోరుకుంటున్న పెద్దపల్లి బస్ డిపో కల సాకారం కాబోతోందని శ్రీధర్ బాబు ప్రకటించారు. ఈ డిపో నిర్మాణానికి సంబంధించి అన్ని అడ్డంకులు తొలగిపోయాయని, అతి త్వరలోనే ఇది అందుబాటులోకి రానుందని ఆయన తెలిపారు. మంథని బస్టాండ్ ఆధునికీకరణ పూర్తయితే ఈ ప్రాంతం రవాణా పరంగా ఒక హబ్‌గా మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. మౌలిక వసతుల కల్పనలో స్థానిక ఎమ్మెల్యేగా తన వంతు కృషి ఎప్పుడూ ఉంటుందని, నియోజకవర్గంలోని ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందించడమే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించడానికి ఆర్టీసీ అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని మంత్రులు ఆదేశించారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, పనులన్నీ నిర్దేశించిన గడువులోపే పూర్తి చేయాలని సూచించారు. రీజనల్ మేనేజర్ స్థాయి అధికారుల నుంచి డిపో మేనేజర్ల వరకు అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, భవిష్యత్తులో వచ్చే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్టాండ్లను తీర్చిదిద్దాలని చెప్పారు. పారదర్శకమైన పాలన అందించే క్రమంలో ప్రభుత్వం చేపడుతున్న ఈ చర్యలు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, కరీంనగర్ రీజనల్ మేనేజర్ రాజు, డిప్యూటీ ఆర్ఎం మల్లేశం, డిపో మేనేజర్ శ్రావణ్ కుమార్, ఆర్డీవో సురేష్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు, ఆర్టీసీ సిబ్బంది ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చూపిస్తున్న ఈ చొరవను స్థానికులు అభినందించారు. ముఖ్యంగా బస్టాండ్ల ఆధునికీకరణ పనులు పూర్తయితే తమ ప్రయాణ తిప్పలు తప్పుతాయని, పుష్కరాల సమయానికి ఇవన్నీ అందుబాటులోకి వస్తాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రవాణా రంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న క్రమంలో రానున్న రోజుల్లో మరిన్ని మార్పులు చోటుచేసుకోనున్నాయి. బస్సుల సంఖ్య పెంచడం, కొత్త డిపోల ఏర్పాటు, బస్టాండ్ల ఆధునికీకరణ వంటి కార్యక్రమాలతో ఆర్టీసీ తన పూర్వ వైభవాన్ని సంతరించుకుంటోంది.

# 24 గంటల కరెంటు ఇస్తేనే ఓట్లు అడగండి

- 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని సీఎం స్పష్టంగా ప్రకటించాలి
- రైతు డిస్కం ఏర్పాటు పూర్తిగా అర్థరహితమైన నిర్ణయం
- నీటి పారుదల ప్రాజెక్టులకు కరెంటు కష్టాలు తప్పవు
- విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేసేందుకు పన్నుతున్న కుట్ర
- ఉన్న రెండు డిస్కంలు చాలనప్పుడు, మూడోది ఎందుకు?
- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని వృధా చేస్తోంది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ప్రస్తుతం విద్యుత్ రంగం చుట్టూ జరుగుతున్న పరిణామాలు ఉత్కంఠను రేపుతున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వం రైతు డిస్కం పేరుతో సరికొత్త వ్యవస్థను తీసుకురావాలని చేస్తున్న ప్రయత్నాలు తీవ్ర విమర్శలకు దారితీస్తున్నాయి. రాష్ట్ర మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఈ విషయంలో ప్రభుత్వంపై కత్తులు నూరుతున్నారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే కుట్రలో భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ డిస్కం ఏర్పాటును ముందుకు తెచ్చారని ఆయన ఆరోపిస్తున్నారు. గతంలో ఉన్న డిస్కంలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు, ఇప్పుడు కొత్తగా మూడో డిస్కం అవసరమేమిటని ఆయన సూటిగా ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ చర్యలు తుగ్లక్ నిర్ణయాలను తలపిస్తున్నాయని, వీటి వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరిస్తున్నారు. రైతులకు 24 గంటల పాటు నిరంతర ఉచిత విద్యుత్ అందించడం సాధ్యం కాదనే భావనతోనే ప్రభుత్వం ఇలాంటి ప్రయోగాలు చేస్తోందని హరీశ్ రావు విమర్శిస్తున్నారు. ఒకవేళ రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే, వచ్చే ఎన్నికల్లో 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తానని ధైర్యంగా చెప్పి ఓట్లు అడగాలని ఆయన సవాల్ విసిరారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల నిర్వహణ విద్యుత్ సరఫరాపైనే ఆధారపడి ఉంటుంది. ఏ జిల్లాకు సాగునీరు అందాలన్నా, ఏ ఎత్తిపోతల పథకం నడవాలన్నా విద్యుత్ వెన్నుముకగా నిలుస్తుంది. డిస్కం ఏర్పాటుతో ప్రాజెక్టులకు విద్యుత్ సరఫరాలో అవాంతరాలు ఏర్పడే అవకాశం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న డిస్కంలు వేల కోట్ల అప్పుల్లో ఉండి, సరైన నిర్వహణ లేక అల్లాడుతుంటే, మరొక కొత్త సంస్థను తీసుకురావడం వల్ల ప్రజాధనం వృథా తప్ప ఏమీ లేదని ఆయన గళమెత్తారు. ప్రభుత్వ అంచనాల ప్రకారం రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ఏటా సుమారు 10 శాతం నుండి 15 శాతం వరకు పెరుగుతోంది. పీక్ అవర్స్ సమయంలో దాదాపు 15,000 మెగావాట్ల వరకు లోడ్ ఉంటుండగా, ఈ పరిస్థితుల్లో కొత్త డిస్కంల వల్ల వ్యవస్థ మరింత అస్తవ్యస్తం కావడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు.



హరీశ్ రావు వాదన ప్రకారం, ఉన్న వ్యవస్థను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, దానిని విచ్ఛిన్నం చేసి ప్రైవేటు శక్తులకు లాభం చేకూర్చే పనిలో నిమగ్నమైంది. డిస్కం ఏర్పాటు వల్ల కేవలం అధికారులు, మధ్యవర్తులకే తప్ప రైతులకు ఒరిగేదేమీ లేదని ఆయన వాదిస్తున్నారు. గత పదేళ్లలో రాష్ట్రంలో సాధించిన విద్యుత్ విజయం, నిరంతర సరఫరా ఇప్పుడు ప్రమాదంలో పడ్డాయని ఆయన ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల నిర్వహణ కోసం ఏటా సుమారు 10,000 కోట్ల రూపాయల వరకు విద్యుత్ ఖర్చు అవుతోంది. ఈ భారాన్ని రైతు డిస్కంపై వేసి, ఆ తర్వాత నెమ్మదిగా సబ్సిడీలను ఎత్తివేసి రైతులపై భారం వేయాలన్నది ప్రభుత్వ ఆలోచన అని హరీశ్ రావు అనుమానిస్తున్నారు. విద్యుత్ సంస్థల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం కాకుండా, కేవలం ఆస్తులను తనఖా పెట్టి అప్పులు తీసుకురావడమే పనిగా పెట్టుకున్నారని ఆయన విమర్శించారు. ఏడేళ్ల క్రితం సుమారు 20,000 కోట్ల అప్పుల్లో ఉన్న విద్యుత్ సంస్థలు, ఇప్పుడు లక్ష కోట్ల అప్పుల వైపు పరుగులు తీస్తుంటే, కొత్తగా డిస్కం ఏర్పాటుతో ఆ అప్పుల భారం మరింత పెరుగుతుందని ఆయన లెక్కలతో సహా వివరించారు. ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి అడుగు రాజకీయ ఉద్దేశంతోనే ఉందని ఆయన ఆరోపణలు చేస్తున్నారు. రైతు సంక్షేమమే మా మొదటి ప్రాధాన్యత అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం, విద్యుత్ విషయంలో ఎందుకు వెనకడుగు వేస్తుందని ఆయన నిలదీస్తున్నారు. రైతు డిస్కం ఏర్పాటు ద్వారా విద్యుత్ ఛార్జీల పెంపునకు ప్రభుత్వం మార్గం సుగమం చేస్తోందని ఆయన అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రంలో సుమారు 27 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. ఈ భారీ సంఖ్యను నిర్వహించడం అనేది చిన్న విషయం కాదు. ఉన్నతమైన సాంకేతికత, అంకితభావంతో కూడిన నిర్వహణ లేకపోతే, ఈ 27 లక్షల కనెక్షన్ల భారం డిస్కమ్‌లను కుప్పకూలుస్తుంది. క్షేత్రస్థాయిలో పరిస్థితిని గమనించకుండా తీసుకునే నిర్ణయాలు, రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తాయని ఆయన హెచ్చరిస్తున్నారు. విద్యుత్ రంగంలో ఏవైనా మార్పులు చేయాలంటే ముందుగా నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి, రైతుల అభిప్రాయాలను తీసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేస్తున్నారు. కేవలం ముఖ్యమంత్రి కార్యాలయం లేదా కొంతమంది అధికారుల ఒత్తిడితో నిర్ణయాలు తీసుకోవడం వల్ల ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఉందని ఆయన అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో విద్యుత్ సరఫరా తీరును పరిశీలిస్తే, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదు. ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్లు, లైన్ల నిర్వహణ కోసం కనీస నిధులు లేని పరిస్థితి ప్రస్తుతం ఉంది. ఇలాంటి సమయంలో కొత్త డిస్కం ఏర్పాటుకు చేసే ఖర్చును, కనీసం రైతుల కష్టాలను తీర్చడానికి ఉపయోగిస్తే బాగుంటుందని ఆయన సూచిస్తున్నారు. విద్యుత్ రంగం అనేది తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి గుండెకాయ లాంటిది. గతంలో ఎదుర్కొన్న చీకటి రోజులను మళ్ళీ వెనక్కి తీసుకురావాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయన తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతులకు ఉచిత విద్యుత్ అనేది కేవలం పథకం కాదు, అది వారి జీవనాడి. ఆ నాడిని తెంచే ప్రయత్నం ఎవరు చేసినా తెలంగాణ రైతాంగం సహించదని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం విద్యుత్ పంపిణీ నష్టాలు ప్రస్తుతం 12 నుండి 15 శాతం మధ్య ఉన్నాయి. ఈ నష్టాలను తగ్గించడంపై దృష్టి సారించకుండా, కొత్త డిస్కంలు అంటూ గందరగోళం సృష్టించడం సరికాదని హరీశ్ రావు స్పష్టం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పుల ఊబిలో కూరుకుపోయి, కొత్తగా వేసే ప్రతి అడుగు ఒక చిక్కుముడిలా మారుతోంది. విద్యుత్ సంస్థల బాండ్లు కొనేందుకు బ్యాంకులు కూడా వెనుకాడే పరిస్థితి నెలకొంది. డిస్కం ఏర్పాటు ద్వారా వచ్చే ఆదాయం ఎక్కడికి వెళ్తుందో ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. గత ప్రభుత్వం పక్కా ప్రణాళికతో విద్యుత్ రంగాన్ని గాడిలో పెడితే, ప్రస్తుత ప్రభుత్వం దానిని నాశనం చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు కనీసం 24 గంటల విద్యుత్ కూడా ఇవ్వలేనప్పుడు, ఇక అధికారంలో ఉండటం దేనికని ఆయన ప్రశ్నించారు. రైతులు చైతన్యవంతులు కావాలని, ఈ కుట్రలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆయన జోస్యం చెబుతున్నారు. వేసవి కాలంలో విద్యుత్ డిమాండ్ పీక్ స్టేజ్‌కి చేరుకుంటుంది. ఆ సమయంలో సరైన విద్యుత్ సరఫరా లేకపోతే సాగు నీటి ప్రాజెక్టులు ఆగిపోతాయి. ప్రాజెక్టులు ఆగిపోతే పంటలకు నీరు అందదు, పంటలు ఎండిపోతే రైతు ఆత్మహత్యలకు దారి తీస్తుంది. ఈ విషయాన్ని ప్రభుత్వం గమనించాలని ఆయన కోరుతున్నారు. చిన్న చిన్న లాభాల కోసం విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేయడం వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై దీర్ఘకాలిక ప్రభావం ఉంటుందని ఆయన ఆర్థిక నిపుణులను ఉద్దేశించి చెబుతున్నారు.

# ఈటలకు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మల్కాజ్‌గిరి ఎంపీ స్థానం రాజకీయంగా ఎప్పుడూ వేడెక్కి ఉంటుంది. తాజాగా ఈ నియోజకవర్గంలో ఈటల రాజేందర్‌ను లక్ష్యంగా చేసుకుని వెలిసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తున్నాయి. మేడ్చల్ అవుటర్ రింగ్ రోడ్డు ప్రాంతంలో వెలిసిన ఈ బ్యానర్లు అటు బీజేపీ వర్గాల్లో, ఇటు రాజకీయ విశ్లేషకుల్లో ఆసక్తికర చర్చకు దారితీశాయి. "నీ ఏడుపే బీజేపీకి శాపం" అంటూ ఎంతో ఘాటుగా, వ్యంగ్యంగా ముద్రించిన ఆ ఫ్లెక్సీలు ఎవరి పని అనే అంశం ఇప్పుడు ప్రధానాంశంగా మారింది. పార్టీలో అంతర్గత పోరు ఏ స్థాయికి చేరుకుందో చెప్పడానికి ఇవి ఒక నిదర్శనంగా కనిపిస్తున్నాయి. ఒక ప్రజా ప్రతినిధిని ఉద్దేశించి ఇంతటి స్థాయిలో నిరసన ప్రదర్శనలు జరగడం పట్ల కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు.




ఈ ఫ్లెక్సీల వెనుక ఉన్న అసలు ఉద్దేశం ఏమిటో స్పష్టంగా కనిపిస్తోంది. పార్టీలో ఈటలకు పదవులు దక్కలేదన్న అసహనం, ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించకపోవడం వంటి విషయాలను ప్రస్తావిస్తూ ప్రత్యర్థులు విమర్శలు గుప్పించారు. కీలకమైన కేంద్ర మంత్రి పదవి ఆశించి భంగపడ్డారనే ఆరోపణలను కూడా ఆ బ్యానర్లలో పొందుపరిచారు. ఇదంతా ఒక క్రమపద్ధతిలో సాగుతున్న విమర్శల దాడిగా కనిపిస్తోంది. ఒక సీనియర్ నాయకుడికి ఎదురవుతున్న ఈ తరహా బహిరంగ విమర్శలు బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి మింగుడుపడటం లేదు. అసంతృప్తిని బయటకు వ్యక్తం చేయడం ద్వారా నాయకుడి ఇమేజ్‌ను దెబ్బతీయాలని చూస్తున్నట్లుగా ఈ ఘటన స్పష్టం చేస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల గణాంకాలను ప్రస్తావిస్తూ ఈ బ్యానర్లలో చేసిన విమర్శలు పార్టీ వర్గాల్లో కలకలం రేపాయి. బీజేపీ అధిష్టానం రెండు వేర్వేరు నియోజకవర్గాల్లో పోటీ చేసే అవకాశం ఇచ్చినా, రెండు చోట్లా ఓటమి ఎదురైందని గుర్తు చేశారు. అయినప్పటికీ మల్కాజ్‌గిరి ఎంపీగా పోటీ చేసే అవకాశం కల్పించినా, గెలిచిన తర్వాత ప్రవర్తన సరిగా లేదని పరోక్షంగా ఎత్తిచూపారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో గెలుపు సాధిస్తే, అది తన సొంత ఇమేజ్ వల్లే జరిగిందని చెప్పుకోవడం ఏ రకమైన రాజకీయ నైతికత అని వారు ప్రశ్నించారు. ఈ వాదనలు పార్టీలో అంతర్గత విభేధాల సెగలు ఎంత తీవ్రంగా ఉన్నాయో తెలియజేస్తున్నాయి. బీజేపీలో పెరుగుతున్న నాయకుల మధ్య సమన్వయ లోపం ఈ ఘటనతో బహిర్గతమైంది. ఒక ఎంపీని ఉద్దేశించి పార్టీ పరమైన విమర్శలను ఇలా రోడ్డు మీద ఫ్లెక్సీల రూపంలో పెట్టడం క్రమశిక్షణను ప్రశ్నిస్తోంది. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కుమార్ పేరును కూడా ఈ వివాదంలోకి లాగడం గమనార్హం. అర్వింద్‌కు వస్తున్న ప్రజాదరణను చూసి కడుపుమంటతోనే ఇలాంటి పనులు చేస్తున్నారా అని ఫ్లెక్సీలలో వేసిన ప్రశ్నలు, పార్టీలో ఉన్న వర్గపోరును స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి. ప్రజాదరణ విషయంలో నాయకుల మధ్య ఉన్న పోటీని ఇలా బయటకు తీసుకురావడం పార్టీ కేడర్‌ను అయోమయానికి గురి చేస్తోంది. ఈ పరిణామాలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తీవ్రంగా స్పందించారు. పార్టీలో ఎలాంటి అంతర్గత విబేధాలు లేవని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీ బలం గణనీయంగా పెరిగిందని, నాయకులందరూ ఐక్యతతోనే ముందుకు సాగుతున్నారని ఆయన పేర్కొన్నారు. తమ నాయకులను లక్ష్యంగా చేసుకుని, పార్టీలో చిచ్చు పెట్టాలని వేరే పార్టీల వారు, బయటి వ్యక్తులు చేస్తున్న కుట్రగా ఆయన దీనిని అభివర్ణించారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తిని కించపరిచేలా ఫ్లెక్సీలు వేయడంపై తక్షణమే చర్యలు తీసుకుంటామని ఆయన ప్రకటించారు. ఈ ఘటనపై న్యాయపరంగా కూడా కఠినంగా వ్యవహరించాలని బీజేపీ నిర్ణయించింది. ఫ్లెక్సీలు వేసిన అజ్ఞాత వ్యక్తులపై డీజీపీకి ఫిర్యాదు చేస్తామని రామచందర్ రావు స్పష్టం చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం ఎవరికీ సరికాదని, నిందితులను వదిలే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు. దీనివల్ల పార్టీ పరువుకు నష్టం వాటిల్లుతుందని భావిస్తున్న నాయకత్వం, విచారణ వేగవంతం చేయాలని కోరుతోంది. రాజకీయంగా ఎదుర్కోలేకనే ఇలాంటి పిరికిపంద చర్యలకు పాల్పడుతున్నారని ప్రత్యర్థులపై విరుచుకుపడ్డారు. మరోవైపు, ఎంపీ ధర్మపురి అర్వింద్ కూడా ఈ వివాదంతో తనకు ఎలాంటి సంబంధం లేదని వివరణ ఇచ్చారు. ఈటల రాజేందర్‌కు, తనకు మధ్య ఎలాంటి విభేదాలు లేవని, ఇద్దరం కలిసి పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్నామని పేర్కొన్నారు.

# రైతు డిస్కం వెనుక పెద్ద కుట్ర!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ విద్యుత్ రంగంలో రానున్న మార్పులు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న రైతు డిస్కం ఏర్పాటుపై టీఆర్ఎస్ నేత కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. రైతు డిస్కంను ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం వెనుక మిగిలిన రెండు డిస్కంలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలనే దురాలోచన ఉందని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. గత ఆరు నెలలుగా ఈ విషయాన్ని అత్యంత రహస్యంగా ఉంచిన రేవంత్ రెడ్డి, ఇటీవల జరిగిన అనధికారిక భేటీలో దీన్ని బయటపెట్టడం అనేక ప్రశ్నలకు తావిస్తోంది. సుమారు 1.2 కోట్ల మంది రైతులు, లక్షలాది విద్యుత్ వినియోగదారుల భవితవ్యం ముడిపడి ఉన్న ఈ అంశంపై ముఖ్యమంత్రి తక్షణమే బహిరంగ ప్రకటన చేయాలని కవిత డిమాండ్ చేశారు. విద్యుత్ రంగంలో తీసుకువస్తున్న ఈ మార్పులు రైతులపై పెను భారాన్ని మోపుతాయని విపక్షాలు ఆందోళన చెందుతున్నాయి. 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరాను నిలిపివేయబోమని, మోటార్లకు మీటర్లు పెట్టబోమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా చెబుతున్నా, దానిపై నమ్మకం లేదని కవిత స్పష్టం చేశారు. కేవలం చిట్ చాట్లలో కాకుండా, ఒక అధికారిక ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి, లేఖ రూపంలో ఈ హామీని రాతపూర్వకంగా ఇవ్వాలని ఆమె సవాలు విసిరారు. లేదంటే, గతంలో మాదిరిగానే ఇచ్చిన మాట తప్పి, ఎన్నికల సమయంలో నిలబడకుండా మాట మార్చే ప్రమాదం ఉందని ఆమె హెచ్చరించారు. ముఖ్యమంత్రి పదవిలో ఉండి బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన రేవంత్ రెడ్డి, ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండాలని కవిత స్పష్టం చేశారు. రుణమాఫీ, రైతు భరోసా, సన్నాల బోనస్, ధాన్యం కొనుగోలు వంటి అంశాల్లో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును కవిత తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆమె ఆరోపించారు. రైతు బీమా చెల్లింపుల్లో జాప్యం, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితులు రైతుల నడ్డి విరుస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఎంతో పద్ధతిగా జరిగిన వ్యవసాయ పనులు, నేడు అధికారుల సమన్వయ లోపంతో సాగునీరు, కరెంట్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాయని ఆమె గణాంకాలతో సహా విశ్లేషించారు. ప్రభుత్వం కేవలం మాటల గారడీతో ప్రజలను మభ్యపెడుతూ, వాస్తవ సమస్యలను గాలికి వదిలేసిందని ఆమె మండిపడ్డారు. రైతు డిస్కం పేరుతో తెలంగాణ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కయ్యాయని కవిత ఆరోపించారు. కేంద్రం ప్రతిపాదించిన ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్ బిల్లును వెనక్కి తీసుకురావడానికి రంగం సిద్ధం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. డిస్కంల ప్రైవేటీకరణ వల్ల విద్యుత్ ధరలు సామాన్యులకు అందనంతగా పెరిగే ప్రమాదం ఉందని ఆమె




హెచ్చరించారు. ఈ బిల్లు వల్ల రాష్ట్రంలోని దాదాపు 30 లక్షల పంప్ సెట్లపై ప్రభావం పడుతుందని, వ్యవసాయ ఖర్చులు 40 శాతం మేర పెరిగే అవకాశం ఉందని ఆమె గణాంకాలను ప్రస్తావించారు. కేవలం పెట్టుబడిదారులకు లాభం చేకూర్చడమే లక్ష్యంగా పాలకులు వ్యవహరిస్తున్నారని, ఇది రైతులకు శాపంగా మారుతుందని ఆమె వాపోయారు. ముఖ్యమంత్రికి నేరుగా సవాలు విసురుతున్నానని కవిత పునరుద్ఘాటించారు. ఒకవేళ రైతు డిస్కం ఏర్పాటు చేసి, మిగిలిన రెండు డిస్కంలను ప్రైవేటుపరం చేస్తే, వచ్చే ఎన్నికల్లో ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు రేవంత్ రెడ్డికి ఉండదని ఆమె స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని లేదా ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ద్వారా అన్ని జిల్లాల్లో సమావేశాలు నిర్వహించి, ప్రజాభిప్రాయాన్ని సేకరించాలని ఆమె కోరారు. దాదాపు 33 జిల్లాల్లో క్షేత్రస్థాయిలో విచారణ జరపకుండా తీసుకునే ప్రతి నిర్ణయం రైతు వ్యతిరేకమని ఆమె పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా చర్చలు జరపకుండా తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే ప్రజలే తిరగబడతారని ఆమె హెచ్చరించారు. హైడ్రా పనితీరుపై కూడా కవిత తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను స్వయంగా ఆరు ఫిర్యాదులు చేసినా, ఇప్పటివరకు ఒక్కదానిపై కూడా చర్యలు తీసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆమె విమర్శించారు.

రియల్ ఎస్టేట్ మాఫియాను వదిలేసి సామాన్యుల ఇళ్లను కూల్చివేయడం ఏ రకమైన న్యాయమని ఆమె ప్రశ్నించారు. చట్టం ముందు అందరూ సమానమని చెప్పే పాలకులు, కేవలం రాజకీయ ప్రతీకారంతోనే వ్యవహరిస్తున్నారని ఆమె మండిపడ్డారు. హైడ్రా ద్వారా జరుగుతున్న ఆక్రమణల తొలగింపులో పారదర్శకత లేదని, కేవలం మీడియాలో హైప్ కోసం మాత్రమే ప్రభుత్వం ఇటువంటి చర్యలకు పాల్పడుతోందని ఆమె ఎద్దేవా చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు. విద్యాశాఖ పర్యవేక్షణ చేస్తున్న ముఖ్యమంత్రి స్వయంగా తన నివాసానికి అతి సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల దుస్థితిని గమనించకపోవడం విచారకరమని ఆమె అన్నారు. వందలాది పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు కరువయ్యాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. విద్యపై బడ్జెట్‌లో కేటాయింపులు పెంచుతామని చెప్పిన ప్రభుత్వం, ఉన్న పాఠశాలలను కూడా మూసివేసే దిశగా అడుగులు వేస్తోందని ఆమె విమర్శించారు. ముఖ్యంగా హాస్టళ్లలో నాణ్యమైన భోజనం అందక విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని, ప్రభుత్వ వసతి గృహాల నిర్వహణలో తీవ్ర అలసత్వం కనిపిస్తోందని కవిత పేర్కొన్నారు. రాష్ట్రంలో పాలన వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందని, అధికారులు ప్రజాప్రతినిధుల మాట వినడం లేదని ఆమె ఆరోపించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత కలిగిన సీఎం, కేవలం ప్రచారానికే పరిమితమవుతున్నారని కవిత అభిప్రాయపడ్డారు. మంత్రులు తమ బాధ్యతలను విస్మరించి, మీడియా సమావేశాలతో సమయం వృథా చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ప్రతి రోజూ కనీసం 500 నుండి 1000 మంది రైతులు తమ సమస్యల కోసం కలెక్టరేట్ల చుట్టూ తిరుగుతున్నా, పట్టించుకునే నాథుడే లేడని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే రైతులకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోవాలని ఆమె కోరారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నది కేంద్రం అని చెబుతున్న రేవంత్ రెడ్డి, రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి ఎందుకు మాట్లాడటం లేదని కవిత ప్రశ్నించారు. సుమారు 10 వేల కోట్ల రూపాయల నిధులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తీసుకురావడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆమె ఆరోపించారు. కేవలం అప్పుల మీద ఆధారపడి రాష్ట్రాన్ని నడపడం వల్ల భవిష్యత్తులో తీవ్ర ఆర్థిక సంక్షోభం తలెత్తుతుందని ఆమె హెచ్చరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు ఎటువంటి స్పష్టమైన ప్రణాళికలు లేవని, కేవలం ఉచిత పథకాల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని ఆమె విమర్శించారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఆదాయాన్ని పెంచే ప్రయత్నం చేయాలని ఆమె సూచించారు. రాజకీయ కక్ష సాధింపులు ఆపి, ప్రజా సమస్యలపై దృష్టిసారించాలని కవిత ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించి, అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని నడపాలని ఆమె సూచించారు. రైతు డిస్కం విషయంలో ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని ఆమె హెచ్చరించారు. ప్రతిపక్ష పార్టీగా ప్రజా సమస్యల పట్ల తాము పోరాడుతామని, ప్రభుత్వం చేసే తప్పులను ఎండగడతామని కవిత స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం తాము రాజీలేని పోరాటం చేస్తామని, అధికార పార్టీ ఎంత బెదిరించినా వెనకడుగు వేసేది లేదని ఆమె ఉద్ఘాటించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఢిల్లీలో నాటకాలు ఎందుకు రాహుల్ జీ..?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఢిల్లీ వేదికగా ఆటో డ్రైవర్లతో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జరిపిన లంచ్ పే చర్చ కార్యక్రమం దేశవ్యాప్త రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. ఆటో డ్రైవర్ల కష్టసుఖాలను స్వయంగా తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఆయన చేపట్టిన ఈ పర్యటనపై తెలంగాణ రాజకీయాల్లో సెగలు మొదలయ్యాయి. ఈ పరిణామంపై స్పందించిన భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కాంగ్రెస్ నాయకత్వంపై విమర్శల దాడిని తీవ్రతరం చేశారు. ఢిల్లీలోని ఆటో డ్రైవర్ల పట్ల చూపిస్తున్న సానుభూతి, తెలంగాణలో ఆ వర్గానికి ఇచ్చిన హామీల అమలులో ఎందుకు కనిపించడం లేదని ఆయన సూటిగా ప్రశ్నించారు. గడచిన కాలంలో ఇచ్చిన మాటలను విస్మరించి, కొత్త వేషధారణలతో డ్రామాలకు తెరలేపడం సరికాదని ఆయన ఎద్దేవా చేశారు. తెలంగాణలో అధికారం కోసం ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ చేసిన భారీ వాగ్దానాలను కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం తాము అధికారంలోకి వస్తే ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ అగ్రనాయకులు గొప్పగా ప్రకటించారు. అంతేకాకుండా, రాష్ట్రంలోని ప్రతి ఆటో డ్రైవర్‌కు ఏటా 12 వేల రూపాయల ఆర్థిక సాయం అందిస్తామని కూడా హామీ ఇచ్చారు. ఈ హామీల అమలుపై స్పష్టత లేకపోగా, క్షేత్రస్థాయిలో పరిస్థితి దారుణంగా తయారైందని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు పగ్గాలు చేపట్టి ఇప్పటికే దాదాపు 30 నెలలు గడుస్తున్నా, డ్రైవర్ల ముఖాల్లో చిరునవ్వు కనిపించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాల సమయం పూర్తయినా, ఇప్పటివరకు సంక్షేమ బోర్డు ఏర్పాటు దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు కేవలం ఓట్ల కోసం మాత్రమేనని, ఆ తర్వాత వాటిని పక్కన పెట్టేయడం కాంగ్రెస్ నైజమని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో డ్రైవర్ల జీవితాల్లో ఎటువంటి సానుకూల మార్పు రాలేదని, పైగా వారి ఆర్థిక పరిస్థితి మరింత దిగజారిందని గణాంకాలు చెబుతున్నాయి. 12 వేల రూపాయల ఆర్థిక భరోసా దక్కకపోగా, నిత్యావసర ధరల పెరుగుదల, కుటుంబ పోషణ భారంతో వారు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొలువుదీరిన నాటి నుండి ఇప్పటివరకు 100 మందికి పైగా ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడటం అత్యంత విషాదకరమని కేటీఆర్ ప్రస్తావించారు. ప్రతి రోజూ ఎంతో కష్టపడి ఉపాధి వెతుక్కునే డ్రైవర్లు, అప్పుల బాధ మరియు ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ప్రాణాలు తీసుకుంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ



వైఫల్యం, ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో చూపిస్తున్న నిర్లక్ష్యం వల్లే ఈ అభాగ్యులు బలవుతున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. ప్రభుత్వం వారిని పట్టించుకోకుండా, ఢిల్లీలో సానుభూతి నాటకాలు ఆడటం ప్రజలందరికీ అర్థమవుతుందని ఆయన ఎద్దేవా చేశారు. ఢిల్లీలో ఆటో డ్రైవర్ల పక్కన కూర్చుని భోజనం చేయడం వల్ల సమస్యలు పరిష్కారం కావని, ముందుగా సొంత రాష్ట్రంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మాట తప్పడం, మడమ తిప్పడం కాంగ్రెస్ సంస్కృతిగా మారిందని ఆయన ఆరోపించారు. తెలంగాణలోని వేలాది మంది ఆటో డ్రైవర్లు నేటికీ ఆ వాగ్దానాల కోసం నిరీక్షిస్తున్నారని, వారి జీవితాలతో చెలగాటం ఆడటం తగదని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం మారినా, డ్రైవర్ల తలరాతలు మారలేదని ఆయన విమర్శించారు. అధికారంలోకి వచ్చిన మొదట్లో చేసిన ప్రకటనలు అమలులో ఎందుకు విఫలమయ్యాయో సమాధానం చెప్పాలని ఆయన నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆటో డ్రైవర్ల సంఘాలు కూడా ఇప్పటికే పలుమార్లు నిరసనలు తెలియజేశాయి. అయినప్పటికీ రేవంత్ సర్కారు స్పందించకపోవడం వెనుక ఉన్న అసలు కారణాలు ఏమిటో ప్రజలకు తెలియజేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. డ్రైవర్ల కోసం ఏర్పాటు చేస్తామన్న సంక్షేమ బోర్డు ఎక్కడో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. 30 నెలల కాలంలో వేల కోట్ల బడ్జెట్ కేటాయింపులు జరుగుతున్నా, ఈ చిన్న వర్గం పట్ల ప్రభుత్వం ఎందుకు అంత వివక్ష చూపుతోందని ఆయన నిలదీశారు. ప్రాణాలను లెక్కచేయకుండా రోడ్ల మీద తిరుగుతూ కుటుంబాలను పోషించుకునే డ్రైవర్ల కన్నీటిని ప్రభుత్వం ఎందుకు చూడటం లేదని ఆయన వ్యాఖ్యానించారు. ఢిల్లీ వేదికగా జరుగుతున్న ఈ రాజకీయ ప్రక్రియలు కేవలం మీడియా దృష్టిని ఆకర్షించడానికేనని ఆయన స్పష్టం చేశారు. నిజమైన చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలో అమలవుతున్న పథకాల లోపాలను సరిదిద్దుకోవాలని ఆయన సూచించారు. దేశవ్యాప్తంగా ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరే హక్కు కాంగ్రెస్ నాయకులకు లేదని, ముందుగా తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని ఆయన హితవు పలికారు. హామీల అమలులో జాప్యం జరుగుతున్న కొద్దీ, ప్రభుత్వానికి ప్రజల్లో ఆదరణ తగ్గుతుందని ఆయన హెచ్చరించారు. ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు ఆగి, వారు గౌరవంగా జీవించే అవకాశం కల్పించడమే ప్రభుత్వ బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు. కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నెటిజన్లు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు తీరుపై భిన్నమైన అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. 30 నెలల కాలంలో సాధించిన అభివృద్ధి కంటే, పెండింగ్‌లో ఉన్న హామీలే ఎక్కువగా కనిపిస్తున్నాయని వారు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన ఆటో డ్రైవర్ల విషయంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు వారి భవిష్యత్తును నిర్ణయిస్తాయని మేధావులు పేర్కొంటున్నారు. హామీలు నెరవేర్చని పక్షంలో ఆందోళనలు తప్పవని పలు సంఘాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి వాస్తవాలను గుర్తించాలని ఆ వర్గాలు కోరుతున్నాయి. చివరిగా, మాటలు కోటలు దాటుతున్నాయని, ఆచరణ మాత్రం శూన్యమని కేటీఆర్ చేసిన విమర్శలు కాంగ్రెస్ నాయకత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. 100 మంది ఆటో డ్రైవర్ల మృతికి బాధ్యత ఎవరిదని అడగడం ద్వారా, ప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడిని పెంచే ప్రయత్నం చేశారు. ఢిల్లీలోని నాటకాలను పక్కన పెట్టి, తెలంగాణలోని ఆటో డ్రైవర్ల కష్టాలను తీర్చడమే అసలైన రాజకీయ బాధ్యత అని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, డ్రైవర్లకు ఆర్థిక సాయాన్ని అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రాజకీయాలు కేవలం ఎన్నికల కోసం మాత్రమే కాదని, ప్రజల కష్టాలను తీర్చడమే అసలైన లక్ష్యం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ఘటనతో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి నిరసనలు, ప్రతి నిరసనలు మొదలయ్యాయి. ఆటో డ్రైవర్ల సంక్షేమం అనే అంశం ఇప్పుడు ప్రధాన రాజకీయ ఎజెండాగా మారింది. ప్రభుత్వం ఈ విమర్శలను ఎలా తిప్పికొడుతుందో వేచి చూడాలి. రాబోయే రోజుల్లో ఆటో డ్రైవర్ల సమస్యలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో, ఇచ్చిన వాగ్దానాలను ఎలా అమలు చేస్తుందోనని ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు. రాజకీయ నాయకులు మాటల గారడీని పక్కన పెట్టి, వాస్తవ సమస్యల పరిష్కారం కోసం పని చేయడమే ప్రజాస్వామ్యానికి శ్రీరామరక్ష అని అందరూ భావిస్తున్నారు. ఆటో డ్రైవర్ల జీవితాల్లో వెలుగులు నింపే దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని, లేనిపక్షంలో పోరాటాలు తప్పవని కేటీఆర్ మరోసారి స్పష్టం చేశారు.

# ఈ ఏడాది చివర్లోనే జీహెచ్ఎంసీ ఎన్నికలు?

**మొదటిపేజీ తరువాయి**

దాదాపు 28 అసెంబ్లీ నియోజకవర్గాలు విస్తరించి ఉన్న ఈ మూడు కార్పొరేషన్ల పరిధిలో అధికారం ఏ పార్టీ చేతికి చిక్కుతుందనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే, జీహెచ్ఎంసీలోని 150 డివిజన్లలో ఒక ప్రముఖ పార్టీ 60 నుంచి 70 స్థానాలను సునాయాసంగా గెలుచుకునే అవకాశం కనిపిస్తోంది. మిగిలిన స్థానాల్లో త్రిముఖ పోటీ తప్పదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల ఫలితాలను చూశాక, ప్రజాభిప్రాయాన్ని బట్టి ఎంఎంసీ, సీఎంసీలకు ఎన్నికలు నిర్వహిస్తే బాగుంటుందని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. కొత్తగా ఏర్పడిన కార్పొరేషన్ల పరిధిలో ఓటర్ల నాడిని పసిగట్టడం రాజకీయ పార్టీలకు కత్తి మీద సాములా మారింది. పాత జీహెచ్ఎంసీలోని కొన్ని ప్రాంతాలు ఇప్పుడు మల్కాజ్‌గిరి, సైబరాబాద్ కార్పొరేషన్లకు బదలాయింపు అయ్యాయి. శంషాబాద్ నుంచి ఆదిభట్ల వరకు ఉన్న స్థానిక సంస్థలు గ్రేటర్ పరిధిలో చేరడంతో అక్కడ ప్రజల తీర్పు ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో డివిజన్ల వారీగా ప్రజల ఓటింగ్ సరళిలో భారీ మార్పులు వచ్చే అవకాశం ఉందని అంచనాలు ఉన్నాయి. శివారు ప్రాంతాల్లో కొత్తగా చేరిన ఓటర్లు ఏ వైపు మొగ్గు చూపుతారనే అంశంపై పార్టీలు నిశితంగా పరిశీలిస్తున్నాయి. ఆర్థికంగా బలమైన పునాదుల కోసం కార్పొరేషన్లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. జీహెచ్ఎంసీ వన్ టైమ్ సెటిల్మెంట్ పథకం ద్వారా ఆస్తి పన్ను వడ్డీపై 90 శాతం డిస్కౌంట్ కల్పిస్తూ ఆదాయాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తోంది. హైదరాబాద్, మల్కాజ్‌గిరి, సైబరాబాద్ కార్పొరేషన్లు క్యూర్ పరిధిలో ఉండటం వల్ల గతంలోనే రూ. 2300 కోట్ల పన్నులు వసూలయ్యాయని మున్సిపల్ శాఖ ప్రకటించింది. ఆదాయ వనరులు ఎక్కువగా ఉన్న కార్పొరేషన్లను సమర్థవంతంగా నడపడం ద్వారా ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. గణాంకాల పరంగా చూస్తే సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆర్థికంగా కీలకంగా మారింది. జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం 11,45,321 నిర్మాణాల నుండి రూ. 863 కోట్ల ఆస్తి పన్ను వసూలైంది. కాగా సైబరాబాద్ కార్పొరేషన్




పరిధిలో 9,43,432 భవనాలు ఉండగా, అక్కడ భారీగా రూ. 916 కోట్ల ఆదాయం సమకూరింది. మల్కాజ్‌గిరి కార్పొరేషన్‌లో 7,91,507 నిర్మాణాల నుంచి రూ. 502 కోట్ల పన్ను వసూలైనట్లు బల్దియా డేటా చెబుతోంది. తక్కువ నిర్మాణాలైనా సైబరాబాద్‌లో పన్ను ఆదాయం ఎక్కువగా రావడం గమనార్హం. నగరం విస్తరిస్తున్న కొద్దీ పన్ను వసూళ్లలోనూ భారీ మార్పులు వచ్చే అవకాశం ఉంది. ఎన్నికల నేపథ్యంలో ఆయా కార్పొరేషన్ల పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ముఖ్యంగా మౌలిక సదుపాయాల కల్పనపైనే దృష్టి సారిస్తున్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాల వంటి ప్రాథమిక అవసరాలను తీర్చడం ద్వారా ఓటర్లను ఆకట్టుకోవాలని పాలకపక్షం భావిస్తోంది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి డివిజన్ల వారీగా సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ప్రత్యేక టీమ్లను ఏర్పాటు చేస్తున్నారు. రాజకీయ పక్షాలు గడప గడపకూ తిరుగుతూ ఓటర్ల మద్దతు కూడగట్టే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యాయి. సాంకేతికతను జోడించి డివిజన్ల రిజర్వేషన్ల ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది. వార్డుల పునర్విభజన జరిగిన తర్వాత ఓటర్ల జాబితాలో పేర్లు చేర్చడం లేదా తొలగించడం వంటి కార్యక్రమాలు జోరందుకున్నాయి. అక్టోబరు రెండో వారంలో ఓటరు జాబితా పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత, రాజకీయ సమీకరణాలు మరింత స్పష్టంగా మారనున్నాయి. ఏ డివిజన్ ఏ సామాజిక వర్గానికి దక్కుతుందనే అంశంపై ఇప్పటికే క్షేత్రస్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. రిజర్వేషన్ల ఖరారుతో పాటు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కూడా వేగం అందుకోనుంది. ప్రస్తుత రాజకీయ వాతావరణంలో ఏ కార్పొరేషన్‌లో ఏ పార్టీ హవా ఉంటుందనే దానిపై సర్వేలు జరుగుతున్నాయి. సైబరాబాద్‌లో ఐటీ రంగం విస్తరించి ఉండటం వల్ల అక్కడి మేధావులు, ఉద్యోగుల ఓట్లు కీలక పాత్ర పోషించనున్నాయి. మల్కాజ్‌గిరి వంటి ప్రాంతాల్లో పాత తరం ఓటర్లతో పాటు కొత్తగా వలస వచ్చిన వారి ఓట్లు కూడా ప్రభావితం చేయనున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ మొత్తం మీద 150 డివిజన్లలో ఎవరు మెజారిటీ సాధిస్తారనేది రాబోయే అసెంబ్లీ ఎన్నికల దిశను కూడా నిర్దేశించనుంది. అందుకే ఈ కార్పొరేషన్ ఎన్నికలను ప్రతి పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మున్సిపల్ కార్పొరేషన్ల పాలనను గాడిలో పెట్టేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఓటరు జాబితాల తయారీ నుంచి పోలింగ్ కేంద్రాల ఏర్పాటు వరకు ప్రతి అడుగును జాగ్రత్తగా ప్లాన్ చేస్తున్నారు. నవంబరు నెలలో ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని అనుమతులు లభించగానే నోటిఫికేషన్ విడుదలవుతుంది. సుమారు 28 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్న సుమారు 28 లక్షలకు పైగా నిర్మాణాల భవిష్యత్తును నిర్ణయించే ఈ ఎన్నికలు అత్యంత కీలకంగా మారనున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ నగర ముఖచిత్రం మారే అవకాశం ఉన్నందున సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# తెలంగాణలో జనసేనకు చోటుందా?

**మొదటిపేజీ తరువాయి**

ప్రకటనలుగా కొట్టిపారేసే అవకాశం లేదని, వ్యూహాత్మక అడుగులు పడుతున్నాయని స్పష్టమవుతోంది. ప్రతీ ఎన్నిక ముందు ఇలాంటి ప్రకటనలు సర్వసాధారణమని, వీటిని పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. అయితే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున జనసేన భారీ సభ నిర్వహిస్తుండటం వెనుక ఉన్న అసలు ఉద్దేశం ఏమిటనేది కీలకం. తెలంగాణలో పార్టీని యాక్టివ్ చేయడమే లక్ష్యంగా పవన్ కల్యాణ్ చేస్తున్న ప్రయత్నం, బీజేపీ వ్యూహంలో భాగంగానే జరుగుతోందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఆరు నెలల ముందు నుంచి సిద్ధమవుతున్న ఈ సభ వెనుక సుదీర్ఘ రాజకీయ ప్రణాళిక దాగి ఉందని కనిపిస్తోంది. ఇది కేవలం ఒక ఆరంభం మాత్రమేనని జనసేన వర్గాలు చెబుతున్నాయి. గత రెండున్నరేళ్లలో జరిగిన ప్రతి ఎన్నికలోనూ ప్రధాన పోటీ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే సాగింది. బీజేపీ మూడో స్థానానికే పరిమితం కావడం ఆ పార్టీకి పెద్ద సవాలుగా మారింది. తెలంగాణలో బీజేపీ లాంటి జాతీయ పార్టీనే మూడో స్థానంలో ఉన్నప్పుడు, ఇక్కడ పునాదులు లేని జనసేనను ప్రజలు ఎలా ఆదరిస్తారని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తెలంగాణ సెంటిమెంట్ బలంగా ఉన్న నేపథ్యంలో, కల్వకుంట్ల కవిత వంటి నాయకులు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు జనసేన ప్రభావం ఎంతవరకు ఉంటుందనేది కీలకమైన అంశం. ఓట్లు చీలిపోతాయని అంటున్నప్పటికీ, జనసేన ఓట్లను చీల్చే స్థితిలో లేదని వాదనలు




వినిపిస్తున్నాయి. రాజకీయాల్లో ఓటమిని ఎదుర్కొన్న పార్టీలే నిలబడతాయని చరిత్ర చెబుతోంది. ఏపీలో పోటీ చేసిన రెండు స్థానాల్లో ఓటమి పాలైన పవన్ కల్యాణ్, నిరాశ చెందకుండా తన వ్యూహాలను మార్చుకున్నారు. పన్నెండేళ్ళ రాజకీయ అనుభవంతో రాటుదేలిన పవన్ కల్యాణ్, నేడు ఏపీలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి, తన పార్టీకి చెందిన మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేసేలా రాజకీయ చదరంగంలో విజయం సాధించారు. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోవడం, వాటిని ఆయుధాలుగా మార్చుకోవడం పవన్‌కు బాగా తెలుసనేది వాస్తవం. ఇప్పటి పవన్ కల్యాణ్ గతంతో పోలిస్తే చాలా మెరుగ్గా, పరిణతి చెందిన నాయకుడిగా కనిపిస్తున్నారు. తన అనుభవంతో తెలంగాణ రాజకీయాల్లో కూడా దూకుడు పెంచేందుకు సిద్ధమవుతున్నారు. తెలంగాణలో బీజేపీతో కలిసి సుదీర్ఘ పోరాటానికి పవన్ సిద్ధమవ్వడం, ఆటుపోట్లను తట్టుకుని నిలబడేందుకు ఆయన వేస్తున్న వ్యూహరచన ఆ పార్టీకి బలాన్ని ఇవ్వవచ్చు. ఏపీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 175 స్థానాలకు గాను 21 చోట్ల పోటీ చేసి 21 స్థానాలను గెలుచుకున్న పవన్ కల్యాణ్, వంద శాతం సక్సెస్ రేటుతో రికార్డు సృష్టించారు. ఇదే ఉత్సాహాన్ని తెలంగాణలో చూపిస్తారా అనేది జూన్ 2న తేలనుంది. రాజకీయాల్లో ఒక స్థానంలో గెలవడానికి వేల కోట్లు ఖర్చు చేసే రోజులివి. అయితే పవన్ కల్యాణ్ కేవలం సిద్ధాంతాలు, జన బలం మీద ఆధారపడి రాజకీయాలు చేస్తున్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన గెలిచిన మెజారిటీలు ఆయన వ్యూహాత్మక చతురతకు నిదర్శనం. అదే వ్యూహాన్ని తెలంగాణలో అమలు చేస్తే, ఫలితాలు ఊహించని విధంగా ఉండే అవకాశం ఉంది. తెలంగాణలో సుమారు 119 శాసనసభ స్థానాలు ఉన్నాయి. వీటిలో జనసేన ప్రభావం ఏ మేరకు ఉంటుందో అప్పుడే చెప్పలేం కానీ, తన ఉనికిని చాటుకోవడానికి పవన్ చేస్తున్న ప్రయత్నం మాత్రం గట్టిగానే కనిపిస్తోంది. బిజేపి జాతీయ నాయకత్వం కూడా పవన్ కల్యాణ్ వ్యూహాలకు పెద్దపీట వేస్తోంది. తెలంగాణలో అధికారంలోకి రావడానికి అవసరమైన సామాజిక సమీకరణాలను పవన్ కల్యాణ్ ద్వారా సాధించాలని బీజేపీ భావిస్తోంది. గతంలో 3 శాతం ఓట్ల షేర్‌తో ఉన్న బీజేపీ, ఈసారి ఆ గణాంకాలను 20 శాతానికి పైగా పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. అటు జనసేన కూడా తెలంగాణలో కనీసం 10 నియోజకవర్గాల్లో పట్టు సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది.

## ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఉచిత దంత వైద్య శిబిరం




**ఐడిఏ నిజామాబాద్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, ఉచిత దంత వైద్య శిబిరం**

**విశాలభారతి, నిజామాబాద్ :** ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడిఎ) నిజామాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గంజ్ ప్రాంగణంలో ఉచిత దంత వైద్య పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమం ఐడిఎ నిజామాబాద్ అధ్యక్షుడు డా. రఘు రావుట్ల, కార్యదర్శి డా. సుగుణాకర్ రాజు ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో సీనియర్ సభ్యులు డా. నందకుమార్, డా. ప్రతాప్ కుమార్, డా. వ్యావహారే, డా. శ్రీనివాస్, డా. సాంబశివరావు, 2026 కార్యవర్గ సభ్యులు, ఐడిఎ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా పొగాకు, నికోటిన్ ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డా. రఘు రావుట్ల, డా. సుగుణాకర్ రాజు, ఇతర సభ్యులు యువత పొగాకు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకోవాలని, క్రీడలను ప్రోత్సహించాలని సూచించారు. గంజ్ ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పా గంగారెడ్డి ప్రారంభించారు. ప్రజలు నోటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పొగాకు వినియోగాన్ని పూర్తిగా మానుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. శిబిరంలో పాల్గొన్న వారికి దంత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు అందించారు. ఈ కార్యక్రమం ద్వారా పొగాకు నియంత్రణ, నోటి ఆరోగ్య పరిరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించారు.

# మరిపెడలో మట్టి మాఫియా రాజ్యం


నర్సింహులపేటలో పట్టపగలే రెచ్చిపోతున్న మట్టి మాఫియా


మరిపెడ గొల్ల కుంట చెరువులో

- తోడుకున్నోడికి తోడుకున్నంత
- డంపింగ్ చేసుకున్నోడికి చేసుకున్నంత
- లక్షల రూపాయల వ్యాపారంగా మారిన నల్ల రేగడి దందా
- అధికారుల మౌనంపై అనుమానాలు

**డోర్నకల్, విశాలభారతి:**

డోర్నకల్ నియోజకవర్గంలో నరసింహుల పేట, మరిపెడ మండలంలో నల్ల రేగడి మట్టి అక్రమ తవ్వకాలు, రవాణా రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఒకప్పుడు అవసరాలకు పరిమితమైన మట్టి తరలింపు ఇప్పుడు కోట్లకు చేరువవుతున్న వ్యాపారంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో నల్ల రేగడి మట్టిని యథేచ్ఛగా తవ్వి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

**తోడుకున్నోడికి తోడుకున్నంత**

డంపింగ్ చేసుకున్నోడికి చేసుకున్నంత" అన్నట్టుగా ఈ వ్యవహారం సాగుతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పగలు తవ్వకాలు.. రాత్రి రవాణా**

మట్టి మాఫియా కార్యకలాపాలు ఎక్కువగా రాత్రివేళల్లో జరుగుతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు.


పట్టపగలే డంపింగ్ చేసిన నల్లరేగడి

పగటిపూట తవ్వకాలు నిర్వహించి, రాత్రివేళల్లో భారీ వాహనాల ద్వారా మట్టిని తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో వరుసగా ట్రాక్టర్లు తిరుగుతుండటంతో గ్రామీణ రహదారులు దెబ్బతింటున్నాయని స్థానికులు వాపోతున్నారు.

**భూముల్లోని నల్ల రేగడి**

మట్టిని తొలగించి విక్రయిస్తున్నట్లు సమాచారం. దీని వల్ల భూముల ఉత్పాదకత తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొందరు వ్యక్తులు భారీ లాభాల కోసం భవిష్యత్ తరాలకు ఉపయోగపడే సారవంతమైన మట్టిని తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

**లక్షల రూపాయల చేతులు మారుతున్నాయా..?**

మట్టి దందాలో రోజూ లక్షల రూపాయల లావాదేవీలు జరుగుతున్నాయనే ప్రచారం మండలంలో జోరుగా సాగుతోంది. ఒక్కో ట్రాక్టర్ లోడ్‌కు వేల రూపాయలు వసూలు చేస్తూ అక్రమార్కులు భారీగా సంపాదిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. డిమాండ్ పెరగడంతో ఈ దందా మరింత విస్తరించిందని సమాచారం.

**చూస్తూ ఊరుకుంటున్న అధికార యంత్రాంగం**

అక్రమ తవ్వకాలు, రవాణా జరుగుతున్నా సంబంధిత శాఖలు కఠిన చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. అధికారుల నిర్లక్ష్యమే మాఫియాకు అండగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు.

**పర్యావరణానికి ముప్పు**

నల్ల రేగడి మట్టి యథేచ్ఛగా తవ్వడం వల్ల భూసారం తగ్గడంతో పాటు పర్యావరణ సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. లోతైన గుంతలు ఏర్పడి ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని చెబుతున్నారు. వర్షాకాలంలో ఈ గుంతలు మరింత ప్రమాదకరంగా మారే పరిస్థితి నెలకొంది.

**ప్రజల డిమాండ్**

మరిపెడ మండలంలో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమార్కులపై కేసులు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు మట్టి మాఫియాకు అండగా నిలిచే వారిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## రాష్ట్రస్థాయి 2026 బెస్ట్ ట్రైబల్ అవార్డు పురస్కారం




**పాల్వంచ :విశాలభారతి:** జనజాతీయ గరిమా ఉత్సవ్ 2026 కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా డాక్టర్ ఎస్ సోమరాజు దొరకు బెస్ట్ ట్రైబల్ అచీవర్ అవార్డు 2026 పురస్కారం లభించింది.చరిత ఆర్గానిక్ కల్టివేషన్ అండ్ సోలార్ డ్రయర్స్ సంస్థ స్థాపించిన 18 నెలల కాలం లోనే తెలంగాణ రాష్ట్రస్థాయి గౌరవాన్ని దక్కించుకుంది. ఆర్గానిక్ మరియు నాచురల్ ఉత్పత్తుల సేకరణ మరియు తయారీ రంగంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం ద్వారానే ఈ అరుదైన పురస్కారం లభించిందని సంస్థ నిర్వహణ అధికారి డాక్టర్ ఎస్ సోమరాజు దొర తెలియజేశారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ నాణ్యమైన వస్తువులు తయారు చేస్తున్న చరిత ఆర్గానిక్ కల్టివేషన్ అండ్ సోలార్ డ్రయర్స్ వారిని ప్రత్యేకంగా అభినందించడం జరిగింది.

## సిఎస్ఆర్ అవార్డును దక్కించుకున్న 'నవ' లిమిటెడ్




**పాల్వంచ, విశాలభారతి:** ఈనెల 30న హైదరాబాద్ లో ఐటీసీ కాకతీయ వేదికగా జరిగిన 'హైదరాబాద్ మేనేజ్మెంట్ 2025 26 సిఎస్ఆర్ అవార్డును ముఖ్య అతిథి త్రిపుర గవర్నర్ ఎస్.ఇంద్రసేనారెడ్డి, గౌరవ అతిథి జడ్జ్ హై కోర్ట్ ఆఫ్ తెలంగాణ ఎస్.నంద చేతులమీదుగా "నవ లిమిటెడ్" ప్రతినిధులు కంపెనీ సెక్రెటరీ వైస్ ప్రెసిడెంట్ శ్రీ వి.ఎస్.ఎన్.రాజు, సి ఎస్ ఆర్ మేనేజర్ సిహెచ్.శ్రీనివాసరావు, సోషల్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసరావు అవార్డును అందుకున్నారు. సామాజిక కార్యక్రమాలు (ఆరోగ్యం, విద్య, జీవనోపాదులు మరియు ఇతర కార్యక్రమాల) ద్వారా సామాజిక అభివృద్ధికి 'నవ లిమిటెడ్' చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డు దక్కిందని వైస్ ప్రెసిడెంట్ మరియు యూనిట్ హెడ్, తెలంగాణ ఆపరేషన్, రేర్ అడ్మిరల్ ఎల్వి శరత్ బాబు వి తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎం.ఎ,ప్రెసిడెంట్, ఎ.దేవేందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్, ఎమ్.శరత్ చంద్ర, సెక్రటరీ శ్రీనివాసు దేవన్, ట్రెజరర్ సి.రమేష్ లక్ష్మణ్, జాయింట్ సెక్రెటరీ, ఎస్.నందన తదితరులు పాల్గొన్నారు.

## కూచిపూడి నాట్య రంగంలో పాల్వంచ వాసికి మెరిట్ బుక్ ఆఫ్ రికార్డ్ పరిష్కారం







**పాల్వంచ, విశాలభారతి :** కూచిపూడి నాట్య రంగంలో విశిష్ట ప్రతిభకు గుర్తింపుగా పాల్వంచ వాసి శ్రీమతి వరలక్ష్మి తాటికొండకు మెరిట్ బుక్ ఆఫ్ రికార్డ్ పురస్కారం ప్రదానం చేశారు. తిరుపతిలో నిర్వహించిన కల్చరల్ హెరిటేజ్ ఆప్ తిరుపతి డాన్స్ ఫెస్ట్ కార్యక్రమంలో ఈ గౌరవం అందుకున్నారు. కూచిపూడి నాట్య కళా వికాసానికి ఆమె అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు, శిష్యులు, అభిమానులు ఆమెకు అభినందనలు తెలిపారు.

## దమ్మపేట అయ్యప్ప స్వామి దేవాలయంలో ఘనంగా శ్రీనివాస కల్యాణ మహోత్సవం

- ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే మెచ్చ
- శ్రీనివాస కల్యాణ మహోత్సవంలో భక్తిశ్రద్ధలతో పాల్గొనడం
- ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరణ
- అనంతరం చిన్నగొల్లగూడెం గ్రామంలోని శుభకార్యానికి హాజరు



**విశాలభారతి , అశ్వారావు పేట :** అశ్వారావుపేట నియోజకవర్గంలోని దమ్మపేటలో గల శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో నిర్వహించిన శ్రీ శ్రీనివాస కల్యాణ మహోత్సవంలో అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం చిన్నగొల్లగూడెం గ్రామంలో జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో జలగం వాసు, గాజుబోయిన ఏసుబాబు, రూపా రాంబాబు, మూర్తి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## మండల స్వర్ణకారుల సంఘం ఎన్నికకు ఆహ్వానం



**తిరుమలగిరి, విశాలభారతి :** సూర్యాపేట జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షులు తొగిటి మురళి ముఖ్య అతిథిగా తిరుమలగిరి మండల స్వర్ణకార అధ్యక్షులు మారోజు ఈశ్వరాచరీ అధ్యక్షతన మండల కేంద్రంలోని పెన్షనర్స్ భవనంలో స్థానిక స్వర్ణ కారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు తొగిటి మురళి మాట్లాడుతూ జూన్ 14వ తారీఖున తిరుమలగిరి స్వర్ణ కారుల సంఘం కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ఇట్టి ఎన్నికలో మండల పరిధిలోని స్వర్ణకారులందరు పాల్గొనవలసినదిగా కోరారు. ఈసందర్భంగా ఎన్నికల నిర్వహణ కోసం ఆహ్వానకమిటీని ప్రకటించారు. అధ్యక్షులుగా మాచర్ల మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి పోలోజు విజయ్ కుమార్, ఉపాధ్యక్షులు కందుకూరు కాంతయ్య చారి, కోశాధికారి చోళ్ళేటి నర్సింహా చారి ల ను నియమించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ సలహాదారు నారాయణదాసు రామాచారి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ బాణాల శ్రీనివాస్, సభ్యులు తొల్లోజు శ్రీనివాస్ చారి, కత్తురోజు లక్ష్మణ చారి, మాచర్ల నాగచారి, పెద్దోట ఉదయ్ లు పాల్గొన్నారు.

## ఎరుకల నాంచారమ్మ బస్తీ 2బీహెచ్‌కే కాలనీ ఎన్నికల్లో గంగయ్య ఘన విజయం

- 39 ఓట్ల మెజార్టీతో అధ్యక్ష పదవి కైవసం – అభివృద్ధి, పారిశుద్ధ్యమే లక్ష్యమని హామీ
- నీటి సమస్య, విద్యుత్, లిఫ్టుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెడతామని కాలనీవాసులకు భరోసా



**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :** ఎల్బీనగర్ నియోజకవర్గం జి ఎస్ ఐ డివిజన్ పరిధిలోని ఎరుకల నాంచారమ్మ బస్తీ (ఆదర్శ్‌నగర్) 2బీహెచ్‌కే డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో నిర్వహించిన కాలనీ కమిటీ ఎన్నికలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 288 ఓట్లకు గాను 280 ఓట్లు పోలవగా, అందులో 3 ఓట్లు చెల్లనివిగా తేలాయి. దీంతో 277 ఓట్లు చెల్లుబాటు అయ్యాయి. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల్లో జగన్నాథం గంగయ్య అత్యధికంగా 126 ఓట్లు సాధించి విజయం సాధించారు. ఆయనకు సమీప ప్రత్యర్థి గోపు శివకు 87 ఓట్లు లభించగా, గుంజ బాలరాజుకు 33 ఓట్లు, వనం రాజుకు 31 ఓట్లు వచ్చాయి. దీంతో జగన్నాథం గంగయ్య తన సమీప ప్రత్యర్థిపై 39 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించి కాలనీ వాసుల విశ్వాసాన్ని మరోసారి చూరగొన్నారు. విజయం అనంతరం గంగయ్య మాట్లాడుతూ.. కాలనీవాసులు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. గతంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా కొనసాగిస్తానని హామీ ఇచ్చారు. కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యల పరిష్కారం, విద్యుత్ సరఫరా మెరుగుదల, లిఫ్టులు సక్రమంగా పనిచేసేలా చర్యలు, పరిశుభ్రమైన వాతావరణం, పచ్చదనం పెంపు వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. కాలనీ ప్రజల సహకారంతో ఆదర్శవంతమైన నివాస సముదాయంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే గంగయ్య అనుచరులు, కాలనీవాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ విజేతకు అభినందనలు తెలిపారు. కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. గంగయ్య నాయకత్వంలో కాలనీ మరింత అభివృద్ధి చెందుతుందనే ఆశాభావాన్ని పలువురు నివాసితులు వ్యక్తం చేశారు.

## మందు కొట్టి బండి నడిపితే కటకటాలే

**వీకెండ్ తనిఖీల్లో 293 మంది మందుబాబులకు చెక్**



**సైబరాబాద్ విశాల భారతి:** వీకెండ్ నేపథ్యంలో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 293 మంది మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరందరిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు ట్రాఫిక్ ఏడీసీపీ జి. హన్మంతరావు వెల్లడించారు. పట్టుబడిన వారిలో 241 మంది ద్విచక్ర వాహనదారులు, 39 మంది కారు డ్రైవర్లు, 11 మంది ఆటో డ్రైవర్లు, ఇద్దరు హెవీ వాహనాల డ్రైవర్లు ఉన్నారు. బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ పరీక్షల్లో 244 మంది 36 నుంచి 200 ఎంజీ/100 ఎంఎల్ మధ్య, 26 మంది 201 నుంచి 300 ఎంజీ/100 ఎంఎల్ మధ్య, 23 మంది 301 నుంచి 550 ఎంజీ/100 ఎంఎల్ మధ్య మద్యం సేవించినట్లు తేలింది.మద్యం సేవించి వాహనం నడపడం క్షమించరాని నేరమని, మత్తులో ప్రమాదానికి కారణమైతే భారతీయ న్యాయ సంహిత 2023 సెక్షన్ 105 ప్రకారం కేసు నమోదు చేస్తామని ఏడీసీపీ హెచ్చరించారు. ఈ సెక్షన్ కింద పదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందని స్పష్టం చేశారు. గత వారం మే 25 నుంచి 30వ తేదీ వరకు కోర్టులు 173 డ్రంక్ డ్రైవింగ్ కేసులను విచారించాయి. వాటిలో నలుగురికి జరిమానాతో పాటు జైలు శిక్ష, ఐదుగురికి జరిమానా, సామాజిక సేవ, 164 మందికి జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రజల ప్రాణాలతో ఆడుకోవద్దని, కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## "మీ సురక్ష"తో ప్రజల భద్రతకు మరింత భరోసా

- బండ్లగూడ ఇందు ఆరణ్య అపార్ట్‌మెంట్స్‌లో పోలీసుల అవగాహన సదస్సు
- ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలి : నాగోల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ

**అబ్దుల్లాపూర్ మెట్ , విశాల భారత :**

ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మీ సురక్ష కార్యక్రమంపై నాగోల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో బండ్లగూడలోని ఇందు ఆరణ్య అపార్ట్‌మెంట్స్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పి. శివనాగ ప్రసాద్ (ఎస్ఐపీ), పి. దశరథ్ (ఎస్ఐపీ), బీసీ2 సిబ్బంది పాల్గొన్నారు. అపార్ట్‌మెంట్ నివాసితులు, మహిళలు, యువత, వృద్ధులు పెద్ద సంఖ్యలో హాజరై పోలీసు అధికారుల సూచనలు, అవగాహన కార్యక్రమాన్ని ఆసక్తిగా విన్నారు.ఈ సందర్భంగా నాగోల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ ముఖ్య అతిథిగా హాజరై అపార్ట్‌మెంట్ వాసులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడమే మీ సురక్ష కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పౌరుల వివరాల నమోదు, ధృవీకరణ ప్రక్రియ, అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సేవల వినియోగం, మహిళలు మరియు పిల్లల భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ నేరాల నుంచి రక్షణ పొందే మార్గాలు, పోలీసు సహాయక సేవలు మరియు హెల్ప్‌లైన్ నంబర్ల వినియోగంపై సమగ్ర అవగాహన కల్పించినట్లు వివరించారు.మహమ్మద్ మక్బూల్ జానీ మాట్లాడుతూ.. ప్రస్తుతం సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తెలియని లింకులు, ఫోన్ కాల్స్, ఓటీపీలు, బ్యాంకింగ్ వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. అనుమానాస్పద సంఘటనలు, వ్యక్తుల కదలికలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మహిళలు, వృద్ధులు, పిల్లల భద్రత విషయంలో అపార్ట్‌మెంట్ సంఘాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, భద్రతా సిబ్బంది వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, మహిళా భద్రతకు సంబంధించిన హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని తెలిపారు.ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి తమ పరిసర ప్రాంతాల భద్రత విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా మీ సురక్ష యాప్, పోలీసు సేవలు, సైబర్ భద్రత, సామాజిక బాధ్యతలపై అపార్ట్‌మెంట్ నివాసితుల్లో చైతన్యం పెరిగిందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం ముగింపులో నివాసితులు పోలీసు అధికారులను అభినందిస్తూ తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.



# డంపింగ్ యార్డు కాదు... డేంజర్ జోన్!

- బండరావిరాలలో 'ఏకో టౌన్' ప్రతిపాదనపై భగ్గుమన్న ప్రజాగ్రహం
- ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టొద్దు.. ప్రాజెక్టు రద్దు చేయకపోతే ఉద్యమం ఉధృతం : సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ హెచ్చరిక

**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :**




రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాల గ్రామ పరిధిలో ప్రతిపాదించిన 'ఏకో టౌన్' (డంపింగ్ యార్డు) ప్రాజెక్టుపై స్థానిక ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గ్రామ ప్రజల ఆరోగ్యం, భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టే ఈ ప్రాజెక్టును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో భారీ అవగాహన సదస్సు నిర్వహించారు.గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు పర్యావరణ ఇంజనీర్ దుబ్బ గీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డుల వల్ల కలిగే అనర్థాలపై రూపొందించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా సదస్సులో మాట్లాడిన పర్యావరణ ఇంజనీర్ దుబ్బ గీత మాట్లాడుతూ.. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఇలాంటి భారీ ప్రాజెక్టులను అమలు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. డంపింగ్ యార్డుల నుంచి వెలువడే విషవాయువులు, దుర్వాసనలు, భూగర్భ జలాల కాలుష్యం కారణంగా ప్రజలు దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ముందుగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి, స్థానికులకు కలిగే లాభనష్టాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సూచించారు.అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు మాట్లాడుతూ.. జనావాసాల మధ్య డంపింగ్ యార్డును ఏర్పాటు చేయాలనే ఆలోచనే ప్రజల జీవితాలతో చెలగాటమాడటమేనని మండిపడ్డారు. గ్రామాల అభివృద్ధి పేరుతో ప్రజల ఆరోగ్యాన్ని బలి చేయొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా బండరావిరాల సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ ఘాటుగా స్పందించారు. ఎకో టౌన్‌కు వ్యతిరేకంగా బండరావిరాల, దేశ్‌ముఖి, పిల్లాయిపల్లి, జగత్‌పల్లి తదితర గ్రామ పంచాయతీలు ఆమోదించిన తీర్మానాలను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్, హెచ్ఎండీఏ కమిషనర్, టీజీఐఐసీ వైస్ చైర్మన్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు అందజేసినా ఇప్పటివరకు స్పందన రాకపోవడం బాధాకరమని అన్నారు.పలుమార్లు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి సమస్యను వివరించినప్పటికీ సంతృప్తికరమైన సమాధానం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యం కంటే ప్రాజెక్టులకే ప్రాధాన్యత ఇస్తే గ్రామ ప్రజలు సహించబోరని హెచ్చరించారు. ఈ డంపింగ్ యార్డు ఏర్పాటైతే రేపటి తరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు కూడా దొరకని పరిస్థితి వస్తుంది. ప్రజల ఆరోగ్యం కోసం అవసరమైతే నా సర్పంచ్ పదవికి రాజీనామా చేయడానికైనా సిద్ధం. గ్రామ ప్రజలందరినీ ఏకం చేసి ఈ పోరాటాన్ని ఎక్కడి వరకైనా తీసుకెళ్తాం అని స్పష్టం చేశారు.ఈ సదస్సులో పాల్గొన్న ప్రజలు కూడా ఏకగ్రీవంగా డంపింగ్ యార్డు ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ప్రభుత్వం వెంటనే ప్రజల అభిప్రాయాలను గౌరవించి ఈ ప్రాజెక్టును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.డంపింగ్ యార్డు ప్రతిపాదనపై బండరావిరాలలో మొదలైన ఈ వ్యతిరేక ఉద్యమం రానున్న రోజుల్లో మరింత ఉధృతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఈ కార్యక్రమంలో దేశ్‌ముఖి సర్పంచ్ దుర్గం జంగయ్య యాదవ్, పిల్లాయిపల్లి సర్పంచ్ పెరుమాండ్ల మహాలక్ష్మి దానయ్య, జగత్‌పల్లి సర్పంచ్ ఇట్టబోయిన మహేష్ యాదవ్, అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షుడు కొత్త కిషన్ గౌడ్, మాజీ సర్పంచ్ హరీష్ యాదవ్, అబ్బవతిని బసవయ్య, కందికంటి బిక్షపతి, చింతల రాజిరెడ్డి, మొలుగు అర్జున్, కావాడి దయాకర్ రెడ్డి, చింతకింది మనోహర్ యాదవ్, గుండ్ల సతీష్ యాదవ్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



# కోహెడ అంతర్జాతీయ సమీకృత మార్కెట్ దేశానికే ఆదర్శం





- **భవిష్యత్ 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అత్యాధునిక సౌకర్యాలతో నిర్మాణం**
- **శంకుస్థాపన పనులను పరిశీలించిన వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**

**అబ్దుల్లాపూర్ మెట్ , విశాల భారతి :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కోహెడ అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ నిర్మాణం దేశానికే తలమానికంగా నిలుస్తుందని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ ముఖ్య కార్యదర్శి కె. సురేంద్ర మోహన్ (IAS), ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం కోహెడలో చేపట్టిన శంకుస్థాపన పనులను వారు ఉన్నతాధికారులు, మార్కెట్ పాలకవర్గ సభ్యులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.పరిశీలనకు ముందు వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి కె. సురేంద్ర మోహన్ కోహెడ గుట్టపై ఉన్న శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీ బాయి, ఇతర అధికారులతో కలిసి మార్కెట్ నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. మార్కెట్ నిర్మాణంలో మరింత నాణ్యత, సౌకర్యాలు కల్పించేలా కొన్ని మార్పులు, సూచనలను సంబంధిత అధికారులకు తెలియజేశారు.తదనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ... కోహెడలో నిర్మించబోతున్న అంతర్జాతీయ సమీకృత మార్కెట్ దేశానికే దిక్సూచిగా మారుతుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా అత్యున్నత ప్రమాణాలతో ఈ మార్కెట్ రూపుదిద్దుకుంటోందని తెలిపారు.రైతులు, వ్యాపారులు, వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని ఆధునిక సౌకర్యాలతో మార్కెట్‌ను నిర్మిస్తున్నామని చెప్పారు. వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు, విక్రయాలకు అత్యంత అనుకూల వాతావరణం కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే శంకుస్థాపన కార్యక్రమానికి వేలాది మంది రైతులు, మహిళలు, ప్రజలు హాజరవుతారని తెలిపారు.రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ ముఖ్య కార్యదర్శి కె. సురేంద్ర మోహన్ మాట్లాడుతూ, కోహెడ మార్కెట్ రాబోయే 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్మించబడుతోందని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, విశాల మౌలిక వసతులు, నాణ్యమైన నిర్మాణ ప్రమాణాలతో మార్కెట్‌ను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్ వ్యవసాయ మార్కెటింగ్ రంగానికి ఇది కొత్త దిశానిర్దేశం చేయబోతుందని అభిప్రాయపడ్డారు.కోహెడలో నిర్మితమవుతున్న ఈ అంతర్జాతీయ సమీకృత మార్కెట్ తెలంగాణ వ్యవసాయ రంగ అభివృద్ధికి కొత్త అధ్యాయంగా నిలవడంతో పాటు రైతులకు, వ్యాపారులకు, వినియోగదారులకు సమగ్ర వేదికగా మారనుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, హాకా డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి (IAS), గిడ్డంగుల సంస్థ ఎండీ కొర్ర లక్ష్మి (IAS), ఆగ్రోస్ ఎండీ రాములు, అడిషనల్ డైరెక్టర్ లక్ష్మణుడు, రవికుమార్, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కరాచారి, ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎల్. శ్రీనివాస్, సభ్యులు పన్యాల జైపాల్ రెడ్డి, బండి మధుసూదన్ రావు, అంజయ్య, మేకం లక్ష్మి, రఘుపతి రెడ్డి, నవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## విశాల భారతి ఎఫెక్ట్..!

- **దళితవాడలో ప్రవహించిన మిషన్ భగీరథ జలధార**
- **విశాల భారతి కథనానికి స్పందించిన జిల్లా యంత్రాంగం**
- **బిందెలతో నీళ్లు పట్టుకొని సంబరాలు చేసుకున్న బేతోలు దళితవాడ ప్రజలు**
- **"విశాల భారతి" దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపిన దళిత వాసులు**
- **ప్రజా సమస్యల పరిష్కారంలో మీడియా కీలక పాత్ర - షేక్ ఖాదర్ బాబా**








**మహబూబాబాద్ విశాల భారతి:** ప్రజా సమస్యలను అక్షరాయుధంగా మార్చి అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో మీడియా పాత్ర ఎంత కీలకమో మరోసారి రుజువైంది. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బేతోలు గ్రామం 6వ, వార్డులో ఉన్న దళితవాడ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న త్రాగునీటి సమస్యకు "విశాల భారతి" దినపత్రికలో ప్రచురితమైన కథనం పరిష్కార మార్గం చూపింది. "మిషన్ భగీరథ మాయాజాలం..! బేతోలు దళితవాడకు స్వచ్ఛమైన నీరు అందించాలి" అనే శీర్షికతో విశాల భారతి ప్రచురించిన కథనం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఊరంతా మిషన్ భగీరథ నీటితో దాహం తీర్చుకుంటుంటే, దళితవాడ ప్రజలు మాత్రం మురికి బావి నీటినే తాగాల్సిన దుస్థితిని కథనం కళ్లకు కట్టినట్లు వివరించింది. గత అనేక సంవత్సరాలుగా దళితవాడలో నివసిస్తున్న వందలాది కుటుంబాలు త్రాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. మిషన్ భగీరథ పథకం రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా అమలవుతున్నప్పటికీ, తమ కాలనీ మాత్రం ఆ వరానికి దూరంగా ఉండిపోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. బావిలో వచ్చే మురికి నీటినే తాగుతూ ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నామని వారు పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందన లేకపోయింది. అయితే విశాల భారతి ప్రచురించిన కథనం పరిస్థితిని పూర్తిగా మార్చేసింది. సామాజిక కార్యకర్త షేక్ ఖాదర్ బాబా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించి దళితవాడ ప్రజల సమస్యను నేరుగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ సంబంధిత మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో సమస్య పరిష్కార దిశగా అడుగులు పడ్డాయి. అధికారుల చర్యలతో దళితవాడలో మిషన్ భగీరథ నీటి సరఫరా ప్రారంభమైంది. ఎన్నో ఏళ్ల నిరీక్షణ తర్వాత నల్లాల ద్వారా స్వచ్ఛమైన త్రాగునీరు రావడంతో కాలనీ ప్రజల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. మహిళలు బిందెలతో నీటిని పట్టుకుంటూ హర్షం వ్యక్తం చేశారు. చిన్నారులు, వృద్ధులు సైతం ఆనందోత్సాహాలతో మిషన్ భగీరథ నీటిని స్వాగతించారు.

**"ఊరంతా భగీరథ నీరు... మా కాలనీకి మాత్రం బావి నీరే"**

ఇప్పటివరకు మా కాలనీలో పరిస్థితి చాలా దారుణంగా ఉండేదని స్థానికులు తెలిపారు. ఇతర ప్రాంతాల ప్రజలు మిషన్ భగీరథ నీరు తాగుతుంటే, తాము మాత్రం మురికి బావి నీటితో కాలం గడిపామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు స్వచ్ఛమైన నీరు అందడంతో తమ కుటుంబాల ఆరోగ్యం మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**శాశ్వత పరిష్కారం కోరుతున్న ప్రజలు**

కాలనీలో నీటి సమస్య పూర్తిగా తొలగిపోవాలంటే ప్రత్యేక వాటర్ ట్యాంక్ నిర్మించి నిరంతర నీటి సరఫరా కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**విశాల భారతికి ప్రజల సెల్యూట్**

తమ సమస్యను సమాజం ముందుకు తీసుకువచ్చి, అధికారులను స్పందించేలా చేసిన విశాల భారతి దినపత్రికకు దళితవాడ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలను వెలికితీసి పరిష్కారానికి మార్గం చూపిన విశాల భారతికి గ్రామస్తులు సెల్యూట్ చేశారు. కలం కదిలితే సమస్య కదులుతుంది... వార్త వెలువడితే వ్యవస్థ స్పందిస్తుంది... బేతోలు దళితవాడలో ప్రవహించిన మిషన్ భగీరథ జలధార అందుకు ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచింది.

## షార్ట్ సర్క్యూట్‌తో డెయిరీ ఫారంలో అగ్నిప్రమాదం

**మూడు దూడలు మృతి.. పలు పశువులకు తీవ్ర గాయాలు.. లక్షలో ఆస్తి నష్టం**



**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మండలంలోని చందానగర్ గ్రామంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్నిప్రమాదంలో మూడు దూడలు మృతి చెందగా, పలు పశువులు తీవ్రంగా గాయపడ్డాయి. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది.గ్రామానికి చెందిన మొరా నర్సింహారెడ్డి భూమిని నగరానికి చెందిన రాజేష్ అనే వ్యక్తి లీజుకు తీసుకుని డెయిరీ ఫారం నిర్వహిస్తున్నాడు. గురువారం సాయంత్రం వీచిన గాలి దుమారం కారణంగా విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగలడంతో షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. దీంతో విద్యుత్ తీగల నుంచి వచ్చిన మంటలు సమీపంలోని కట్టెలతో నిర్మించిన గుడిసెపై పడి, అక్కడి నుంచి పశువుల షెడ్డుకు వ్యాపించాయి. మంటలు వేగంగా వ్యాపించడంతో షెడ్డులో ఉన్న మూడు దూడలు సజీవదహనమై మృతి చెందాయి. అలాగే మూడు ఆవులు, మూడు గేదెలు తీవ్రంగా గాయపడ్డాయి. ప్రమాద సమయంలో షెడ్డులో నిల్వ ఉంచిన పశువుల మేత పూర్తిగా దగ్ధమైంది.అదేవిధంగా అక్కడ ఉన్న ట్రాక్టర్, కుట్టు మిషన్ కూడా అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో లక్షల రూపాయల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు రాజేష్ తెలిపారు. గాయపడిన పశువుల పరిస్థితి విషమంగా ఉండటంతో మరింత నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించగా, అప్పటికే భారీ నష్టం సంభవించింది. ప్రభుత్వం, పశుసంవర్ధక శాఖ అధికా రులు స్పందించి తమకు తగిన నష్టపరిహారం అందించాలని బాధితులు కోరుతున్నారు.

## గిరిజనే త్రూడి పై కేసు నమోదు చేయాలి

- **మా నాన్న కొట్టిన పోడు భూమిపై గిరిజనేత్రులు అడ్డుపడుతున్నారు**
- **పోడు భూముపై గిరిజనేతలకు ఏంటి సంబంధం**
- **ఫారెస్ట్ భూమిలో పోడు కొడితే కేసులు కూడా అయ్యాయి**
- **సంబంధంలేని గిరిజనేత్రుడు కి పందుల గూటికి పర్మిషన్ ఎవరిచ్చారు తేల్చాలి.**
- **మా పోడు భూముల జోలికి వస్తే సహించేది లేదు**
- **బాధ్యత కుటుంబాన్ని పరామర్శించిన ఆదివాసి నేత కంగాల రమణకుమారి**



**భద్రాచలం, విశాలభారతి:** ఎటపాక మండలం రాజుపేట కి ఆనుకొని ఉన్న ఫారెస్ట్ భూమిలో రాజపేటకు చెందిన స్థానిక ఆదివాసులు 2000 సంవత్సరము నుండి ఫారెస్ట్ భూమిలో పోడు కోట్టుకొని వ్యవసాయం చేస్తున్నారు. అందులో ఇర్పా వెంకటేశ్వర్లు కూడా సుమారు రెండు ఎకరాలు భూమిని కోట్టి ఉన్నారు. గతంలో ఆ భూమి కొట్టిన దాని నిమిత్తం అటవీ అధికారులు వారిపైన కేసులు కూడా నమోదు చేయడం జరిగిందని ఇరప వెంకటేశ్వర్లు కుమార్తె ఇరుప లక్ష్మి తెలిపారు. ఈ మధ్యకాలంలో గిరినేత్రుడు అయిన కొంతమంది నేను పోడు కొట్టుకున్న భూమిలో అక్కడ పందులు పాక నిర్మించారని పందులపాకను ఆదివాసులం కలిసి గుడిసెను తొలగిస్తుంటే మాపైన దౌర్జన్యానికి దిగారని ఆమె కన్నీరు పర్యంతం అయింది. మాకు ఏ ఆధారం లేదని ఆ ఒక్క పోడు భూమి మాకు ఆధారమని ఆమె తెలిపారు. నా భూమిలోకి గిరినేత్రులు చొరబడి మాపై దౌర్జన్యం చేస్తున్నారని ఆమె ఆవేదన చెందింది. నేను కొట్టిన పోడు భూములో గుడిచేసుకుని నాపైన పోలీస్ స్టేషన్లో కేసు పెట్టారని సంబంధిత అధికారులు నాకు న్యాయం చేయాలని ఆమె కోరారు. ఈ ఘటన స్థలానికి మహాజన సమితి ఆదివాసి మహిళ రాష్ట్ర కన్వీనర్ కంగాల రమణకుమారి పరామర్శించి వారికి అండగా నిలబడ్డారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిఫ్త్ షెడ్యూల్ ఏరియాలో భూమి పైన సర్వ అధికారాలు ఆదివాసీలవే అని ఆదివాసులు పోడు వ్యవసాయమే ఆధారమని అందులో భాగంగా రాజుపేటలో ఫోడు భూమి కొట్టుకుని వ్యవసాయం చేస్తుంటే కొంతమంది గిరిజనేత్రలు ఆదివాసుల పైన దౌర్జన్యం చేయడం సరైనది కాదని పోలీస్ ఉన్నతాధికారులు ఫారెస్ట్ అధికారులు పిఓ స్పందించి ఆదివాసుల భూములపైన దౌర్జన్యం చేసి ఆదివాసులను మానసికంగా ఆందోళన చెందే విధంగా చేస్తు కులం పేరుతో దూషిస్తున్న వారి పైన చట్టపరమైన చర్య తీసుకొని పోడు భూములకు తక్షణమే పట్టాలు మంజూరు చేసి ఆదివాసి హక్కులను చట్టాలను కాపాడవలసిందిగా ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## బీజేపీ బలోపేతమే లక్ష్యంగా శిక్షణ మహాభియాన్

- **రంగారెడ్డి జిల్లా స్థాయి శిక్షణ శిబిరంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**
- **కార్యకర్తలే పార్టీకి వెన్నెముక.. సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు**

**అబ్దుల్లాపూర్ మెట్ , విశాల భారతి :** భారతీయ జనతా పార్టీ సంస్థాగత బలోపేతం, కార్యకర్తల నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా నిర్వహిస్తున్న "పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ శిక్షణ మహాభియాన్ - 2026" కార్యక్రమం రంగారెడ్డి జిల్లాలో ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో బండ్లగూడలోని శ్రేయస్ కాలేజీలో నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షణ శిబిరంలో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తల సమక్షంలో జరిగిన ఈ శిక్షణ శిబిరంలో పార్టీ సిద్ధాంతాలు, సంస్థాగత నిర్మాణం, కార్యకర్తల బాధ్యతలు, ప్రజా సమస్యల పరిష్కారంలో బీజేపీ పాత్ర, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలపై ప్రత్యేక సెషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలను లోతుగా అర్థం చేసుకుని ప్రజలకు చేరవేయడంలో ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. కార్యకర్తల సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడానికి ఈ శిబిరాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని ఆయన సూచించారు. బీజేపీ సిద్ధాంతాలు, జాతీయవాద భావజాలం, సేవా కార్యక్రమాలను ప్రజలకు వివరించి పార్టీ విస్తరణకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.పార్టీ బలోపేతానికి కార్యకర్తలే ప్రధాన బలమని, శిక్షణ ద్వారా నాయకత్వ లక్షణాలు పెంపొందడంతో పాటు ప్రజలతో మరింత సన్నిహితంగా పనిచేసే అవకాశం లభిస్తుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని అభిప్రాయపడ్డారు.పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికి చేరవేసి, ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త ముందుకు సాగాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు. ఈ జిల్లా స్థాయి శిక్షణ శిబిరంలో జిల్లా, నియోజకవర్గ, మండల, డివిజన్ స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, బీజేపీ అనుబంధ విభాగాల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలపై
# యువజన కాంగ్రెస్ సమరశంఖం




- **జూన్ 3న అచ్చంపేటలో భారీ నిరసన కార్యక్రమం – విజయవంతం చేయాలని పిలుపు**
- **నీట్ పేపర్ లీక్, పెట్రోల్ ధరల పెంపుపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు : జక్కిడి శివచరణ్ రెడ్డి**

**అబ్దుల్లాపూర్ మెట్ , విశాల భారతి :**

రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరాభవన్‌లో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఇంచార్జ్ సయ్యద్ ఖాలీద్ అహ్మద్, సహ ఇంచార్జ్‌లు రోషిని కుషాల్ జైస్వాల్, కేఆర్ భవ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జక్కిడి శివచరణ్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై యువజన కాంగ్రెస్ రాష్ట్రవ్యాప్తంగా పోరాట కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. ముఖ్యంగా నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం, పెట్రోల్, డీజిల్ ధరల పెంపు, యువత ఉపాధి సమస్యలు, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న విధానాలపై కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల తరపున పోరాడుతోందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసే క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా జూన్ 3న నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ్ భాను చిబ్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యువత, విద్యార్థులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, ప్రజల గొంతుకగా యువజన కాంగ్రెస్ ముందుండి ఉద్యమాలను కొనసాగిస్తుందని శివచరణ్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాలడుగు నాగార్జున, గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇంచార్జ్‌లు, కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు పాల్గొని రానున్న కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. జూన్ 3న అచ్చంపేటలో జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు.

# ఫేక్ జీవోల దందా బట్టబయలు

**ప్రభుత్వ భూమికి ఎసరు పెట్టిన సూత్రధారి రాధాకృష్ణ అరెస్ట్**

**సైబరాబాద్ - విశాల భారతి**



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

సచివాలయంలో అటెండర్‌గా పనిచేసి... డిప్యూటీ కలెక్టర్ అవతారమెత్తాడు. ఉద్యోగాల పేరుతో కోట్లు కొల్లగొట్టి... చివరకు ఫేక్ జీవోలతో ప్రభుత్వ భూమికే ఎసరు పెట్టాడు. గండిపేట సర్వే నెం.18లోని విలువైన భూమిని కాజేసేందుకు పన్నిన భారీ కుట్రను సైబరాబాద్ నార్సింగి పోలీసులు ఛేదించారు. ఈ కేసులో కీలక సూత్రధారి వేలాది రాధాకృష్ణ, 53, అతని డ్రైవర్ గ్యారా ప్రవీణ్‌కుమార్, 34,లను పోలీసులు అరెస్టు చేసి కటకటాల వెనక్కి నెట్టారు. 2006 నుంచి 2009 వరకు ఏపీ సచివాలయంలో ఐటీ విభాగంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా చేరిన రాధాకృష్ణ, అక్కడే ప్రభుత్వ ఫైళ్ల తతంగం ఒంటపట్టించుకున్నాడు. ఆ తర్వాత ఉద్యోగం వదిలేసి, తాను డిప్యూటీ కలెక్టర్‌నని, లాయర్‌నని బిల్డప్ ఇచ్చాడు. 2013లో ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.30 లక్షలు వసూలు చేయడంతో కరీంనగర్‌లో తొలిసారి కేసు నమోదైంది. ఆ తర్వాత నల్గొండలో అటెండర్ ఉద్యోగం పేరుతో రూ.18 లక్షలు, మొయినాబాద్‌లో సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో ఉద్యోగం పేరుతో రూ.3 లక్షలు దండుకున్నాడు. ఇలా రాజేంద్రనగర్, నేరేడ్‌మెట్, గోదావరిఖని, కర్నూలు, కరీంనగర్‌లలో మొత్తం తొమ్మిది కేసులు అతని చుట్టూ అల్లుకున్నాయి. ఉద్యోగాల దందాతో విలాసవంతమైన జీవితానికి అలవాటుపడిన రాధాకృష్ణ కన్ను... భూములపై పడింది. డ్రైవర్ ప్రవీణ్ ద్వారా కొవ్వూరు సునీల్‌తో చేతులు కలిపి, గండిపేట సర్వే నెం.18 భూమిపై కన్నేసిన నిమ్మల రాజేశ్, వేణుగోపాల్, రామస్వామి, గారెల మంగ గ్యాంగ్‌తో జతకట్టాడు. ప్రభుత్వ పోరంబోకు భూమి అని తెలిసి కూడా, ఏపీకి చెందిన నేత బ్రహ్మనాయుడు, అతని సోదరుడు రమేశ్‌కు ఆ భూమిని రెగ్యులరైజ్ చేయిస్తానని, వారసత్వ హక్కులు ఇప్పిస్తానని మాయమాటలు చెప్పాడు. అంతటితో ఆగకుండా ఓ లాయర్ సాయంతో నకిలీ జీవోలు, సీసీఎల్ఏ ప్రొసీడింగ్స్, ఎన్ఓసీలు సృష్టించాడు. సీనియర్ ఐఏఎస్ అధికారుల సంతకాలను సైతం ఫోర్జరీ చేసి, అచ్చం అసలు ఉత్తర్వుల్లా తయారు చేశాడు. ఈ మాయాజాలంలో కొవ్వూరు సునీల్, కరణం రాజేశ్, ప్రభుదాస్‌లు డబ్బు



నిందితుల వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న ట్యాబ్లు,వివిధ ఫేక్ డాక్యుమెంట్లు

చేరవేత, డాక్యుమెంట్ల రవాణా చేస్తూ కీలకంగా వ్యవహరించారు. ఈ భారీ డీల్‌లో బ్రహ్మనాయుడు, రమేశ్‌లకు, భూమి యజమానుల ముసుగులో ఉన్నవారికి మధ్య ఏకంగా రూ.12 కోట్ల లావాదేవీలు జరిగినట్లు పోలీసుల దర్యాప్తులో బట్టబయలైంది. కేసు బయటపడటంతో పరారైన రాధాకృష్ణకు డ్రైవర్ ప్రవీణ్ అండగా



నిందితుల వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న స్టాంపులు, వివిధ బ్యాంకు పాస్ పుస్తకాలు,, మొబైల్స్

నిలిచాడు. డాక్యుమెంట్లు దాచిపెట్టి, పోలీసుల కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ తప్పించే ప్రయత్నం చేశాడు. సాంకేతిక ఆధారాలతో ఇద్దరినీ పట్టుకున్న పోలీసులు వారి నుంచి ఐదు ల్యాప్‌టాప్‌లు, 13 రబ్బర్ స్టాంపులు, 12 చెక్‌బుక్‌లు, ఏడు బ్యాంకు పాస్‌బుక్‌లు, పది ఏటీఎం కార్డులు, 31 భూముల డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. ఫేక్ జీవోలతో ప్రభుత్వ భూములను కబ్జా చేసే వ్యవస్థీకృత ముఠా గుట్టురట్టు చేసిన పోలీసులు, పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు.



## విడాకులపై హన్సిక ఎమోషనల్ కామెంట్స్

సినీ పరిశ్రమలో సెలబ్రిటీల విడాకులు తరచూ వార్తల్లో నిలుస్తూనే ఉంటాయి. ప్రేమగా మొదలైన బంధాలు అనుకోని కారణాలతో ముగిసిపోవడం అభిమానులను నిరాశకు గురిచేస్తుంటుంది. తాజాగా నటి హన్సిక తన వైవాహిక జీవితానికి ముగింపు పలికిన అనంతరం మొదటిసారి ఈ అంశంపై బహిరంగంగా స్పందించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భర్త సోహైల్ ఖతూరియాతో విడిపోవాలని నిర్ణయించుకున్న తర్వాత ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో హన్సిక తన వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొన్న భావోద్వేగ పరిస్థితులను వివరించారు. జీవితంలో కొన్ని నిర్ణయాలు కఠినంగా అనిపించినప్పటికీ, అవి మన మంచికే అయితే వాటిని ఆలస్యం చేయకుండా తీసుకోవాలని ఆమె అభిప్రాయపడ్డారు.ఒక నిర్ణయం తప్పు అని అనిపిస్తే దాన్ని సరిదిద్దుకోవడానికి వెనుకాడకూడదు. గత రెండేళ్లుగా నా మానసిక పరిస్థితి చాలా ప్రభావితమైంది. సాధారణంగా నేను చాలా ఉల్లాసంగా, ఆనందంగా ఉండే వ్యక్తిని. కానీ ఆ సమయంలో పూర్తిగా నిశ్శబ్దంగా, బాధతో ఉండేదాన్ని. నా పరిస్థితిని చూసి కుటుంబ సభ్యులు కూడా చాలా ఆందోళన చెందారు అని హన్సిక తెలిపారు. తన జీవితంలో అత్యంత క్లిష్టమైన దశలో ఒక స్నేహితురాలు అండగా నిలిచిందని ఆమె చెప్పారు. నా పరిస్థితిని గమనించిన ఓ స్నేహితురాలు డాక్టర్‌ను సంప్రదించి నాకు థెరపీ అవసరమని సూచించింది. ఆ తర్వాత నేను కౌన్సెలింగ్ తీసుకున్నాను. ఆ ప్రక్రియ నాకు ఎంతో సహాయపడింది. ఈ రెండేళ్లు జీవితంలో ఎన్నో పాఠాలు నేర్పించాయి. సమస్యలను ఎలా ఎదుర్కోవాలి, ఎలా ముందుకు సాగాలి అనే విషయాలు నేర్చుకున్నాను అని వెల్లడించారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.